వచన ప్రబంధము

శ్రీరస్తు.

శ్రీశోభనాద్రీశః.

శ్రీబ్రహ్మాండపురాణాంతర్గతంబగు

శ్రీశోభనాచలమాహాత్మ్యమనకు

తెలుగువచనప్రబంధము.

ఇది

కృతికర్తగారి కుమారులును

శ్రీరాజా రంగయ్యప్పారావు బహద్దర్ జమీందార్

ఆఫ్ నూజవీడు వగయిరాదొరగారి

ఆస్థానపండితులును నగు

శ్రీమాన్ చిలకమర్రి - లక్ష్మణాచార్యులవారిచే

పరిశోధింపఁబడి

శనివారప్పేటరాజధానియందు

సదరు ప్రభువువారి

శ్రీరాజ్యలక్ష్మీవిలాసముద్రాక్షరశాలయందు

ముద్రింపించి ప్రకటింపఁబడియె.

1893

పీఠిక.

శ్రీనూజవీడుజమీలో నాగిరిపల్లియనుగ్రామంబున అప్పారావువారి
కిష్టదైవంబై శ్రీశుభవ్రతమహారాజు తపోవ్యాజంబుచే ననేకయుగముల
క్రిందట శ్రీశోభనాచలమను పర్వతంబున స్వయంవ్యక్తంబుగా వెలసి
వేంచేసియున్న శ్రీశోభనాచలలక్ష్మీనృసింహస్వామివారి యవతారవై
భవక్రమంబును అంతకుపూర్వమే వరహారూపియగు నాభగవంతుం
డు తనపేరుగా నటనొనరించియున్న శ్రీవరాహపుష్కరణి వైభవంబు
నులోనురాగల యనేకప్రభావంబులం దెలుపుచున్న శ్రీబ్రహ్మాండ పు
రాణమందలి శ్రీశోభనాచలమహాత్మ్యము ౯ అధ్యాయముల గ్రంథ
ము సంస్కృతభాషతో నుండుటచే నందరకు తెలియకుండుట నరసి,
శ్రీరాజా రంగయ్య అప్పారావు బహదరు జమీందారు ఆఫ్ నూజవీడు
స్వసంస్థానాస్థాన విద్వాంసులయం దొక్కరగు శ్రీమాన్ చిల్లకష్ట్రి
వెంకటాచార్యులవారింగాంచి మీరాంధ్రగీర్వాణంబులయందసమాన ప్ర
జ్ఞకలవారు గనుక నీశ్రీశోభనాచలమాహాత్మ్యమును సులభశైలితోడ
ఆంధ్రవచనప్రబంధంబుగా రచియించి సర్వజనుల నానందింప జేయుండ
నియాజ్ఞయిడ తదాజ్ఞానుసారంబుగా నవ్విద్వద్వర్యులు నృపాలునకు త
నలోకమునందుగల సదమలకృపనుసార్థక్యమొనరింపదలంచి యీ శో
భనాచలమహాత్మ్యము సంస్కృతంబునకు సమానంబుగానుండి సుబో
ధంబుగా నుండునట్లీ తెలుగు వచనప్రబంధంబు నిట్లురచియించిరి.

దీనిం జదివి సర్వజనులును శ్రీశోభనాచలలక్ష్మీనృసింహస్వామి దివ్య
వైభవంబుసులభంబుగా దెలుసుకొని వారికృపాపాత్రులయి సర్వసం
తోషంబుల నందెదరుగాక.

యీగ్రంథము వలయువారు శ్రీరాజ్యలక్ష్మీవిలాసముద్రాక్షరశాలకు
వ్రాసికొనిననంపెదము. దీని వెల ౦-౨-౦

శ్రీమతే రామానుజాయనమః.

ఆంధ్ర శోభనాచలమాహాత్మ్యం.

శ్రీశోభనాచలాధీశ శ్రీనృసింహవపుర్హరిః ।
రాజ్యలక్ష్మ్యాసహాసీనః పాయాద్వ స్సర్వదాముదా॥

క. శ్రీవరపద సేవాపర । భావనపరశోభనాద్రిభూపాత్మజన ।
ద్భావరమ్యస్మన్నార । య్యావనిపావరజరంగయాప్వారాయా॥

వచనం॥ భవదీయాభ్యుదయ పరంపరాభి వృద్ధిప్రదంబుగా నాయొనర్పంబూనిన శ్రీబ్రహ్మాండపురాణస్థిత శోభనాచలమహాత్మ్యాభిఖ్యోత్తమ కథానిర్వచనకరంబగు కేవల వచన ప్రబంధంబు శ్రోతానంద సంపద్యశోభాభిరామ కరంబై వెలయు నాకర్ణింపుము. మున్ను శ్రీనివాస ప్రసాదంబునకై సత్రయాగంబు సేయుచు నైమిశారణ్యంబున నుండెడు శౌనకుండు మొదలగు మహామునులు, సూతునివలన సరసంబున బుణ్యకథలు వినుచు, నాకాశమార్గంబున నచ్చటి విచ్చేయు నారదమునిం గనుంగొని మునులందరును ప్రాంజలులై సంభ్రమంబున లేచి నమస్కరించి మంగళప్రదంబులగు పూజాద్రవ్యంబుల నమ్మునీశ్వరుని బహు ప్రకారంబుల నానందాశ్రు పరిపూర్ణలోచనులగుచు నర్ఘ్యపాద్యాదులం బూజించి సంతసింపం జేసిన నారదుండును సత్రయాగంబున విష్ణుభక్త పరాయణులగు శౌనకాది మహామునులం జూచి, యేను కృతార్థుండనైతినని భవ్యంబగు పీఠంబునం గూర్చుండ నమ్ముని యనుజ్ఞ వడసి వారును యుచిత వంబునం గూర్చుండి రయ్యవసరంబున శౌనకాది మహామును లద్దే

వమును నుద్దేసించి, యోమహాత్మా! చిరకాల ప్రార్థితంబగు భవదీయ దర్శనంబున నేమందరమును కృతార్థులమయితిమి. సత్యలోకంబున భవదీయ జనకుండగు చతుర్ముఖుండు కుశలియే? స్వేచ్ఛాసంచారివగు నీదు సంకల్పంబు సఫలంబే? యని యడిగిన, నారదుండిట్లను నీ సత్రయాగం బొనర్చుచుండెడు మీ దర్శనంబున నాదగు స్వేచ్ఛందగమనంబు సర్వంబును సఫలంబయ్యె. పుణ్యశీలురగు మిమ్ము దర్శించుటకై యేతెంచితి ననిన విని శౌనకుండు నారదుం గని మహాత్మా! భవద్దర్శనంబున నగు సంతోషంబున మీవలన కొన్ని విశేష పుణ్యకథలు వినంగోరి యున్నవారము. దేవా! నీకు నెరుంగం బడనియవి యన్యులచే నెరుంగ దగినయవి గానము. నీవు సర్వలోక సంచారివి గావున, విష్ణుండును రుద్రుండును బ్రహ్మయును నెరుంగం జాలని సర్వలోక గతాగత వృత్తాంతంబు లెరుంగంజాలుదువు గాన, విచిత్రంబగు శంకర వృత్తాంతంబును, చతుర్ముఖ వైభవంబును, బుణ్యతమంబులగు విష్ణుకథలును వరుణ మహేంద్రాగ్ని కుబేర పవన యక్షరాక్షస సిద్ధ గంధర్వ కిన్నరాప్సరసాది సమస్త దైవికవృత్తాంతంబులును, యిబ్భూలోకంబునంగల సకల మనుష్యాది సర్వజంతు వ్రాతప్రచారంబులును, పాతాళలోకంబున నొప్పెడు పన్నగచేష్టితంబులును, ప్రత్యక్షంబుగా జూచిన మహానుభావుండవు. సకలపురాణంబులును, సర్వశాస్త్రంబులును, నిఖిలాగమంబులును, నఖిల దేశంబులును, స్మృతులును, విశేషంబుగా నెరుంగుదువు. వీణా కవిత్వ విద్యానిపుణుండవు, నాట్యవిద్యా విశ్రుతుండవు, నిరంతరంబుగా సర్వవిద్యలు నీయందన యుండుం గావున నీ యెరుంగని యర్థం బించుకంతయును లేదు. పూర్వజన్మకృతంబులగు పుణ్య విశేషంబులచే భవద్దర్శనంబు సంప్రాప్తంబయ్యె. మహాత్మా! మదీయంబగు విజ్ఞాపనంబు నవధరించి యనుగ్రహింపవలయు ననిన విని నారదుండిట్లనియె, నో మహాత్ములారా! మీరలు సమస్త కథా విశేషంబు లెరింగిన వారయ్యును, మదీయ వచనంబులు వినంగోరి యడిగితిరి. మీమనంబున వినంగోరినవి

త్తాంతం బెయ్యదియనిన శౌనకుండిట్లనియె. మునివరా! యీలోకం బుల దుష్టుల హింసించుటకును సాధుల రక్షించుటకునునగు జగదీశ్వరుని మత్స్య కూర్మాది దివ్యావతారంబు లనేకంబులు గలవు, యయ్యవతారంబులందు విచిత్రంబులును పవిత్రంబులునునగు హరిచరిత్రంబు లనేకంబులు గలవందు కొన్ని విశేషంబులు మాబుద్ధికిం దగినయంత యెరింగితిమి. మరియు దేవాదిదేవుండగు నారాయణునిచే భక్తసంరక్షణార్థంబుగా నంగీకరింపంబడిన శ్రీ నృసింహావతారంబున నగు సర్వచరిత్రంబులును, భవన్ముఖంబున వినంగోరి ప్రార్థించెదము. నిఖిలజగద్వ్యాపకుండగు విష్ణుండు సత్వరుండై స్తంభంబుభేదించి నృసింహరూపంబున నావిర్భవించి హిరణ్యకశిపును సంహరించి ప్రహ్లాదుం గాచె. నట్లు ప్రహ్లాదునియం దనుగ్రహంబున భక్తరక్షాను రూపంబగు దివ్యమంగళ విగ్రహంబు ధరియింపుచు బ్రహ్మాది దేవతలచే స్తుతింపంబడియె నని వింటిమి గాని యద్దేవుని యనంతర ప్రచారం బేమెరుంగ మిప్పుడు మీవలన వినంగోరియున్న మమ్మనుగ్రహించి యచ్చరిత్రం బంతయుం జెప్పవే యనిన నారదుండు విని మీరలడిగిన యక్కథ త్రైలోక్య మంగళ కరంబు గావున చెప్పెద, సావధాన చిత్తులరై వినుం డదియెట్టులనిన మున్ను భక్తాగ్రగణ్యుండగు ప్రహ్లాదున కత్యంత సంతాపకరుండును తండ్రియు నగు హిరణ్యకశిపును సంహరించియు కోపంబుదీరక రౌద్రతరంబగు నాకారంబున సర్వలోకంబుల క్షోభింపం జేయుచు, సురాసురలకు భయం బొనరింపుచు సిద్ధసాధ్యగణంబుల పీడింపుచును, యక్ష కిన్నర గణంబుల వేయుచును, యిట్లు లోకరక్షణార్థంబుగా నవతరించిన నరసింహమూర్తియగు భగవంతుండు జగత్త్రయంబున కత్యంత భయం బొనరింపుచున్నంత నద్దేవుని కోపోపశమనంబునకై శ్రీదేవి యత్యంత మనోహరంబులగు ముఖాద్యవయవ శృంగారంబుల వలన దన ప్రాణవల్లభు చిత్తంబుస్వాయత్తంబుజేయుచు వచ్చినిలచినం గాంచి యాక్షణంబ క్రోధంబు విడచి సుప్రసన్న చిత్తుండయ్యె. నిట్లు లక్ష్మీసమేతుండునుం, బ్రసన్నవదనా

వచనము ప్రథమాధ్యాయము

భిరాముండును, శుద్ధసత్త్వసంపన్నుండును, నిజవధూ సమాలింగ నా
నందజనిత పులకాలంకృత దివ్యమంగళ విగ్రహుండును నగు లోకర
క్షామణి తన్నుం గాంచి డగ్గరి బ్రహ్మాది దేవతలు ప్రణమిల్లి బద్ధాంజలిపు
టులయి, స్తుతియింపుచున్నం జూచి సంతసిల్లె, నట్టియెడ నద్దేవతల
దరును, దేవా! నీవు పరబ్రహ్మస్వరూపుండవు, విశ్వైకకారణుండవు,
నీప్రపంచంబున కంతరంబునను, వెలపలనను, వ్యాపించియుండెద, వట్టి
భవదీయ సర్వవ్యాపకత్వం బంగీకరింపక హిరణ్యకశిపుండు ద్వేషించి,
విష్ణుండెచ్చటనుండు గనుపింపుమని కొడుకు నడిగిన నమ్మహాను భా
వుండు యీ భూమియందును, జలంబులయందును, వహ్ని వాయు
వులయందును, నాకాశంబునందును, సర్వదిక్కులయందును, సూ
ర్యమండలంబునందును, చంద్రాదులయందును, నక్షత్రంబులయందు
ను, తిర్యక్ప్రచారంబున తిర్యగ్జంతువులయందును, పూజ్యంబులయందు
నపూజ్యంబులయందును, సారాసార పదార్థంబులయందును, సర్వ
పదార్థంబులయందును, సర్వకాలంబులయందు నుండు, నూరకం
జెప్పనేల వినుము. నీయందును, నాయందు యుండునని బలుకు
చున్న భక్తవాక్యంబులు సత్యంబు సేయుటకును, శత్రునిజంపుటకును,
జగద్వ్యాపకత్వంబు బ్రకటించుటకునై స్తంభంబున వెడలి లోకంబు
న నసమాన వైభవుండును, భక్తరక్షణైక దీక్షితుండును, వైకుంఠనా
థుండును, నగు నిన్ను బ్రసన్నులమై సేవించెదము. దేవా! నీదగువా
త్సల్యంబునకునుం, గారుణ్యంబునకునుం, దగు నీత్రైలోక్య రక్షణార్థం
బగు నవతారంబు స్థిరంబగుం గావుత లక్ష్మీసాన్నిధ్య సుందరంబును, భ
గవత్సన్నిధానంబును, నరసింహరూపాలంకృతంబును, నగునిద్దివ్యమం
గళవిగ్రహంబు నిత్యంబును సేవింపంగోరెదమని విన్నవించెడు బ్రహ్మాది
దేవతల కీయకొని యానరసింహదేవుండు సంతసించి లక్ష్మీసమేతంబు
గా నంతర్ధానంబునొందె. నంత బ్రహ్మాదిదేవతలు పరమప్రీత చేత
స్కులై యథాప్రకారంబులం జనిరి. మరియు లక్ష్మీసమేతుండగు న
న్నారాయణుండు శ్వేతదీపంబున విచిత్రతర వైడూర్య పద్మరాగ వ

జ్ర నీలాది రత్న ప్రభాభాసుర ప్రాసాద శిఖరాలంకృతంబును, సువర్ణవర్ణహంసాది విహగవిహార్యమాణ కాంచన పద్మశోభిత దివ్యస్వచ్ఛసలిల సులలిత సరోవర సమావృతంబును హారకేయూరాది దివ్యభూషణ భూషితాప్సరోగణ సమాకీర్ణంబును, ఉచ్చైస్స్వరంబులం గానంబు సల్పెడు కిన్నర గంధర్వ సంగీత భంగీతరంగితంబును సుపర్వహస్తనిర్ముక్త కల్పద్రుమ కుసుమసంకీర్ణంబును, తపఃప్రభావ దీప్యమాన బ్రహ్మర్షి సేవితంబును నై తేజోవిరాజమానంబులగు విమానంబులును, రత్నచిత్రితకలశ శోభితంబులగు రథంబులును నైరావతంబుకన్న నధికంబులై వెలయు గజంబులును, నుచ్చైశ్రవంబునకు హెచ్చగు హయంబులును గలిగి, నారాయణ పార్శ్వచరులగు విష్వక్సేనాదులు సేవింప, దేవదుందుభి నిర్ఘోషంబులు సెలంగ శంఖకాహళ మురజ మృదంగ డమ్మగ నిస్వనంబు ల్లుల్లసిల్ల, ముక్తులునుం దేవతలుం జేయుస్తోత్రంబులు కోలాహలింప, ననంతగరుడాదులును మూర్తిధరంబులగు చక్రాది పంచాయుధంబులును నెలయ విరాజమానంబగు శ్వేతదీపంబున వసియించి సంతుష్టమానసుండై యుండె, నట్లు ప్రహ్లాదవరదుండగు భగవంతుండు శుభవ్రత తపోవిశేషంబునకు నలరి లక్ష్మీసమేతంబుగా శ్రీశోభనాచలంబను గిరీంద్రంబున వసియించి భాసిల్లుచునుండె నంత.

క. శ్రీరమణీమణిరమణ । శ్రీరమణీయాంఘ్రి పద్మచిత్తమధుకర ।
స్ఫారతరకీర్తిరమ్యా । కారాంచిత రంగనాయకాప్పారాయా॥

మాలినీ॥ సకలవిబుధగేయ స్ఫారకీర్తిప్రతాపా । ధికరుచిరతర
శ్రీదీప్యమాన స్వరూపా । ప్రకటితజయలక్ష్మీ భవ్యవంశప్రదీపా ।
భ్యకలుషగుణ రంగయ్యాప్పారాయావనీపా॥

ఇది సకల విబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి లక్ష్మణాచార్య తనూజాత వెంకటాచార్య కృత శ్రీబ్రహ్మాండ పురాణస్థిత నృసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమాహాత్మ్య నిర్వచనవచనప్రబంధంబునందు ప్రథమాధ్యాయప్రవచనము॥

శ్రీమతేరామానుజాయనమః.

శ్రీశోభనాచల మాహాత్మ్యం తెలుగు - ద్వితీయాధ్యాయము

శ్రీవనితా సన్మానస। జీవనరుహ హంస నారసింహాంఘ్రిసరో।
జావసథహృదయభృంగబు। ధావనచణరంగనాయకాహ్వారాయా॥

అవధరింపుము. యిట్లు నారదుండెరింగించిన విని శౌనకుండు మహాత్మా! శోభనాచలమాహాత్మ్యంబు నీచే లెస్సగాజెప్పంబడియె, నమ్మహామహీధరంబుననగు భగవత్సాన్నిధ్యంబుసర్వంబునుం జెప్పవేయని నవిని నారదుండు, సద్బుద్ధిలక్ష్మీసంపన్నుండగు శౌనకమునీ నీవడిగినకథ సవిస్తరంబుగా జెప్పెద నాకర్ణింపుము. యీ శుభవ్రతుండు చంద్రవంశంబునం బుట్టినవాడును సత్యసంధుండును జితేంద్రియుండునగు మరియును, మున్ను చంద్రవంశంబున బుట్టిన నహుషుండను నరేంద్రునకు తమ్ముండగు రజియను రాజశేఖరుండు చంద్రసమాన ప్రభావిరాజమానుండై సౌరాష్ట్రదేశాధీశ్వరుండై కుబేరుండునుంబోలె వెలయుచు స్వర్ణగోపుర భాసురంబగు హాటకపురిం బరిపాలనంబుసేయుచుండె, నాప్రతాప సంపన్నుండు సేనాసమేతుండై రిపులజయించి తత్తద్దేశంబులం బలిమింగొని, యదియునుం బాలింపుచు నింద్రుని కన్న నధిక వైభవంబున నలరుచు నిధుల నెన్మిదింటి నార్జించి కుబేర కల్పుండయి దాతృత్వంబున కల్పవృక్షంబుల మీరియొప్పె, నమ్మహోదారునకు సత్యవ్రతుండన విశ్రుతుండగు పుత్రుం డుద్భవించి శౌర్యాతిరేకంబున తండ్రినింబోలి యెల్లభూమండలంబునం బాలింపుచు సుగుణాంబుధియగునమ్మహానుభావుండు సకలధనంబులనునర్థులకొసంగుచు వివిధంబులగు తపోభరంబుల శ్రీహరిం బ్రసన్నునింగా జేసికొనిన, నమ్మధుసూద

నుండగు భగవంతుండాసత్యవ్రతునకై ప్రసన్నుండయ్యె, నట్లు హరిభక్తివిశేషంబువలన పుణ్యశ్లోకాగ్రగణ్యుండై తత్ప్రసాదంబున శుభవ్రతుండనఁనొప్పి సర్వోత్తముండగు పుత్రునింగనియె, నంత సత్యవ్రతుండాపుత్రునియందు రాజ్యభారంబిడి హరిం భజింపుచు తత్ప్రసాదంబున పరమపదంబధిగమించె, నంత శుభవ్రతుండును తండ్రింబోలి సర్వేశ్వరుండగు నారాయణునియందత్యంతభక్తిపరాయణుండై రాజ్యపరిపాలనంబుసేయుచు శ్రీహరియందు చిత్తంబు విడువక శ్రీమంతుండును రాజాధిరాజననందగి పదియారవ వత్సరంబునకు లోనగు వయోవిశేషంబుననె, యఖిలదిక్కులం జయించుటకునై విక్రమించి పాండ్య, కేరళ, వంగ, కుకుర, కురు, సింహళ, పారశీక, వరహాటక, మాళవ, విదర్భ, కోసల, చేది, కాంభోజ, దేశంబులును నింకతక్కినదేశంబులును బహుతర ప్రతాపసంపన్నుడయి జయించి, యిట్లు సర్వదేశంబులును స్వాయత్తంబుజేసి యద్వితీయుండయిపాలింపుచు, స్వప్నంబుననైన నసత్యంబు పలుకక, పరాంగనల నిరీక్షింపక, యాచకాభీష్టంబులుదీర్చుటకునై ధనంబులార్జింపుచు, స్వయంవరంబున విదేహరాజపుత్రియగు శుభాంగియను కన్యకం బెండ్లియై వేదపారగులును శ్రోత్రియులును నగు బ్రాహ్మణ శ్రేష్ఠులకు ధనంబు లొసంగుచు, సర్వకాలంబులందును నన్నదానంబున విప్రులందృప్తులంజేయుచు, దేవబ్రాహ్మణ భక్తిసంపన్నుండై యశ్వమేధయాగంబు జేసి, యయ్యుత్తమ యజ్ఞంబున మేరుభూధరంబుదక్క నిఖిల భూమండలంబునందుగల ద్రవ్యంబంతయు నర్థులకొసంగి, శాస్త్రోక్తాధిక దక్షిణాప్రదానంబులరుత్విక్కులసంతుష్టులంజేసి, యద్దివ్యంబగు క్రతువరంబు హరిసమర్పణంబున సఫలంబుజేసె, నిట్లారాజవరుం డశ్వమేధావభృథస్నానార్ద్రీకృతశరీరుండై యొక్కనాడు స్వర్గలోకంబువలననే తెంచిన సనత్కుమారమునిం గాంచి పాదంబులు శిరంబునసోక మ్రొక్కి యర్ఘ్యపాద్యాదికంబు లొసంగికుశలంబడిగిన సర్వంబును కుశలంబయని యమ్ముని బలికి వినయశాలియగు నాశుభవ్రతుని సంతుష్టహృదయుండై స్తుతియించి మహాత్మా! నీవ

న్యదేవతా విముఖుండవై వాసుదేవైకపరాయణుండవగుటంజేసి, పునరావృత్తి రహితంబగు శాశ్వత విష్ణుపదంబు జెందుమని దనంతన నమ్ముని బలికిన శుభవ్రతుండు మునివరేణ్యా! నీవగురుండవును దైవంబునుం గాన నావాంఛితంబు విన్నవించెద నవధరింపుము. ప్రహ్లాదవరదుండును, నరసింహరూప దివ్యమంగళవిగ్రహుండును, నగు నారాయణుని నారాధింపంగోరెద నయ్యాప్సితం బెయ్యుపాయంబున సిద్ధించును, భవదీయ పాదసేవకుడనగు నాయందు కృపచే నెరుంగంజెప్పు మేతపంబున నరకంఠీరవుండు నన్ననుగ్రహించునని నరేంద్రుండడిగిన, నమ్మునీంద్రుండు మనురాజంబగు శ్రీమష్టాక్షరీమంత్రంబు నిత్యంబునుం జపింప తపస్సిద్ధియగు వినుము విజనప్రదేశంబున నివసించి భోగంబు నిరసించి, నరసింహరూపంబు మనంబున ధ్యానింపుచు సిద్ధిం బొందుమని మునివర్యుండు బలికి స్వర్గంబునకుం జనిన నాసువ్రతుండగు శుభవ్రతుండు తపంబుసేయంబూని రాజ్యభారంబు మంత్రులయందునిచి యొక్కరుండును బురంబు వెడలిజని తపోయోగ్యంబగు విజనప్రదేశం బన్వేషింపుచు కృష్ణవేణియను మహానదికి యోజన దూరంబున నర్ధ-యోజన విస్తీర్ణంబగు వరాహతీర్థ-రాజంబున తన్మధ్యదేశంబున వెలయు శుభాచలంబను భూధరంబునుంగాంచిజని యప్పర్వతసమీపంబున తాలకృతమాల తాపింఛప్రియంగు కింసుకమాతులుంగ పనాసాదివృక్ష విరాజితంబగు నవ్వరాహతీర్థంబునందు పవిత్రంబులగు జలంబుల స్నానంబొనర్చి, ప్రహ్లాదవరదుండగు నరసింహదేవుని ధ్యానింపుచు తపం బొనరింపుచు, నొకప్పుడు తన వీక్షణంబులు సూర్యమండలంబునం గీలించి తప్పకజూచుచు నలుదిక్కుల జాజ్వల్యమానంబులగు నగ్నుల నిడికొని యిట్టు పంచాగ్నిమధ్యంబున నుగ్రంబగు తపంబుసేయుచు నరసింహ దివ్యమంగళ విగ్రహంబు భావంబునంజేర్చియుండె. మరియును నత్తపంబున, క్రమంబున, ఫలాహారంబును, పర్ణాశనంబును, నుదకపానంబును, మాని, వాయుభక్షణమాత్రంబున శరీరంబు నిలుపుకొని వేసవిని పంచాగ్నిమధ్యంబున నుండియు శీత

కాలంబున కంఠమాత్రం జలంబుల నిలిచియు వర్షకాలంబున నిరావృత ప్రదేశంబున స్థండిలశాయియునగుచు, యెండయు గాలియు వానయు లెక్కింపక, మరియును నిద్రాహారంబులు మాని, పరబ్రహ్మస్మరణంబుజేయుచు పాదాంగుష్ఠమాత్రంబు భూమియందుమోపి యుగ్రంబగు తపంబుసేయుచున్న శుభవ్రతుంగాంచి యచ్చటివిమానంబులంజరించు దేవతలు వెరగందియుం పరు నేకంబై స్వర్గంబునకుం బోయి దేవేంద్రునకుంజెప్పిననయ్యింద్రుండును నాశ్చర్యభయంబులుమెలంగతనపదంబునకుభంగంబగునని శంకింపుచు నత్తపోవిఘ్నంబునకై యత్తపోధనునికడకుమేనకంబంచిన నయ్యప్సరోగ్రగణ్యయగు మేనకయును స్వర్గంబువలననిర్గమించిభూలోకంబునకువచ్చి తీవ్రంబగుదపంబుసేయుచున్న శుభవ్రతుని పురోభాగంబున నిలచి, శృంగార మనోహరంబులును, భూషణంబులకుభూషణంబులును నగుచు వెలయు సర్వావయవంబులుమెరయ సఖీజనసమేతంబుగా వీణెచేతంబూని స్వచ్ఛంబులగు సంగీత మధురసుధావర్షణంబుల నచ్చటి ద్రుమంబుల పల్లవింపంజేయుచు కొంతదడవు శృంగారవిలాసంబులు మెరయ నమ్మహారణ్యంబున విహరింపుచు నమ్ముని మనోహరణార్థంబుగాకొన్నిశృంగారచేష్టితంబుల దత్తపోవిఘ్నంబునకైయొనర్చె నదియెట్లనిన, దివ్యంబులగు తనమేని పరిమళంబులుఘ్రాణతర్పణంబులగు ననివాయు మార్గంబుల మెలంగుచును పరిధానవస్త్రంబుజార సువర్ణకలశసుందరంబులగు కుచంబుల గనంజేయుచు, విహారవిశేషంబుల శిథిలబంధంబగు వేణీభరంబు మరలం జక్కజేయు నెపంబున బంధురతర స్తనాభోగ మనోహరంబులగు దోర్మూలంబులంజూపుచు కాంచీమణిఘంటికా ఘణఝణత్కారంబులు నందియలసింజానినాదంబులును కంకణనిక్వాణంబులును కామశాస్త్రంబులుపన్యసించు చందంబున నొప్పియుండ నవ్వాసుదేవ చరణకమల విన్యస్తస్వాంతుండును, సంస్తంభితేంద్రియ చేష్టితుండును నగు నమ్మహానుభావుండు పరవశంబున నయ్యింతి సంగీతమధురభాషణాది చేష్టితంబులు గాఢనిద్రాపరవశుండునుంబోలె నేమియు నెరుంగండయ్యె, మరియు నక్కాంతాలలామంబు ననేకశృంగారగర్భితంబులగు చేష్టలో

నర్చిన శ్రీమన్నారాయణ సక్తచిత్తుండగు నమ్మహాప్రభావుండు తన యింద్రియవర్గంబనాయత్తంబుగాకుండజేసి స్థాణుప్రచందంబున నిశ్చలుండై యున్న జూచి యమ్మేనకయుం దనసేయుయత్నంబు వ్యర్థంబగుటయు సిగ్గువడి స్వర్గంబునకేగి విన్నవించిన నవ్వనితవచనంబుల నబ్భూమీశుండుసేయు తీవ్రంబగుతపఃప్రభావంబంతయు దేవేంద్రుండు విని భయవిభ్రాంతులయిన తక్కిన దేవతలుం దానును శ్వేతద్వీపంబునకుం బోయి, యచ్చటి లక్ష్మీసమేతుండును బ్రహ్లాదతపఃఫలంబునునగు నద్దేవుని సేవించి, ప్రహృష్టాంతరంగులయి వందనంబాచరించి దేవా! భవచ్చరణారవిందసేవనంబున నేముధన్యులమైతిమి లక్ష్మీసమేతుండవై యియ్యేకాంతస్థలంబున విలసింపుచుండు నీకు నమస్కరించెదము. జగత్కార్యం బెఱింగియు నెఱుంగని తెఱంగున పూర్ణకాముండవయి యుండెదవు యిప్పుడ నొక్క మహాభయంబు సంప్రాప్తంబయ్యె నదియెయ్యదియనిన సత్యవ్రతమహారాజకుమారుండగు శుభవ్రతుండు దీప్తంబగు తపోవహ్నిచే నిఖిలజగంబును దహింపం జేయందలంచియున్నవాడు. దేవా! నరకంఠీరవా! యిటపయి యుగ్రతపంబు సేయకుండ నమ్మహాత్మునికి వరంబొసంగ వలయునని దేవతలు ప్రార్థింప, సర్వలోకాత్మకుండగు నన్నారాయణుండు నగి యట్లసేసెదనని పలికి వారలతమతమ లోకంబులకుం బనిచినం జనిరంత॥

క॥ శ్రీకమనీయ విభూషా । భాకలితోదారహార భాసురవక్షా।
స్తోకేతరకౌస్తుభరుచి । రాకృతిమద్ధరివిధేరాశంకయ్యన్నృపా॥

మాలిని॥ సుమహితగుణరత్నస్తోమదుగ్ధాబ్ధిసీమా । సమధికతరబాహా
సార ధూతారి కామా । విమలతరయశశ్రీవిస్ఫురత్పూర్ణసోమా ।
విమతమతి తమస్సంవేశశాంత్యుష్ణధామా॥

ఇది సకలవిబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి
లక్ష్మణాచార్యతనూజాత వేంకటాచార్యకృత శ్రీబ్రహ్మాండపు
రాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమాహాత్మ్య
నిర్వచనవచనప్రబంధంబునందు ద్వితీయాధ్యాయప్రవచనము

శ్రీమతే రామానుజాయ నమః ।

శ్రీశోభనాచలమాహాత్మ్యము - తృతీయాధ్యాయప్రారంభము.

శ్రీభామాకుచకుంకుమ । శోభవ్యభుజాంతరాళభాసన్మూర్తి ।
శ్రీభరితనారసింహప । దాభిరతస్వాంతరంగయాప్పారాయా॥

మరియు నవధరింపు మభ్భగవంతుండు వరాహసరస్తటంబున తపంబు సేయుచున్న శుభవ్రతు ననుగ్రహింపందలంచి ప్రసన్న మధురసలిలంబును కూజద్రాజహంస మల్లికాది పక్షిగణశోభితంబును, విహరచ్చక్రవాక కారండవాది విహగ విభాసురంబును, విహార్యమాణ వానర భల్లూకమృగఖవన చరవిరాజితంబును, వికసిత కల్హార పంకజాదిదర్శనీయంబును, తత్సౌరభభర సంభావితంబులయి విజృంభించి రొదలు సేయు తుమ్మెదలచే నలంకృతంబునునగు సత్తీర్థరాజంబు గనుంగొని తత్తీరంబున నూర్ధ్వబాహుండును బహుతర తేజస్సంపన్నుండును వాయుమాత్రాహారుండును జటామకుటాలంకృతమస్తకుండును ప్రాణాది వాయునిరోధంబున నిశ్చలదేహుండునై యయోనిసంభూతంబగు నరసింహదివ్యమంగళ విగ్రహంబు మనంబునం దలంచుచు తపంబుసేయుచున్న శుభవ్రతుంగాంచి ప్రహ్లాదునిగా దలంచి యనుగ్రహించుటకునై శరణాగత రక్షాపరుండగు నద్దేవదేవుండు లక్ష్మీసమేతుండును గరుడారూఢుండును నై ప్రత్యక్షంబయ్యెనట్లు కారుణ్యామృత పరిపూర్ణలోచనుండును శంఖచక్రధరుండును, వరదుండును, చతుర్భుజుండును ప్రసన్నవదనుండును, నరసింహరూపుండును, పరిస్ఫురత్కేసరాలంకృతాంసుండును, హిరణ్యవక్షశ్శైల వజ్రాయమానంబులును, లక్ష్మీకరోరస్తనసంగభంగురంబులును, శత్రుశోణితరక్తంబులును, నగు నఖాంకురంబులచే ప్రకాశమానుండును, సువర్ణచేలాలంకృత విగ్రహుండును,

కౌస్తుభమణిప్రభావిభాసమాన హారవల్లరీవిరాజిత వక్షస్థలుండును, రత్నాంగదాలంకృతబాహుండును, శశాంక శుభ్రవర్ణుండును, గదానందకాద్యంచిత కరకమలుండును, కనత్కిరీటాలంకృత మస్తకుండును, కనత్కాంచీదామాభిరాముండును, గరుడారూఢుండును, లక్ష్మీసమేతుండును, ప్రహ్లాదవరదుండును, నగు నన్నరసింహదేవుని సందర్శించి శుభవ్రతుండానందబాష్పంబులు నేత్రంబులవెడల సంభ్రమంబున నద్దేవుని కభిముఖుండుగాబరువిడి భక్త్యతిశయంబున దత్పాదపంకజంబులకు బహువారంబులు నమస్కారంబులుసేయుచు స్తుతింపందొణంగె నదియెట్లనిన, సర్వభూతేశ్వర! సర్వాత్మక! నిఖిలజగత్కారణ! దైత్యశిక్షక! భక్తరక్షణార్థంబుగా స్తంభంబున నావిర్భవించిన పరంజ్యోతిస్స్వరూపుండవు, నాద్యంతశూన్యుండవు, వేదాంత సారుండవు, భక్తాధీనుండవును, శరణ్యుండవును, హిరణ్యకశిపను పెనుచీకటికిసూర్యుండవు, ప్రహ్లాదుండను చాతకంబునకు కాలమేఘుండవు, జ్ఞానప్రదుండవు, జ్ఞేయుండవు, జ్ఞానగమ్య స్వరూపుండవు, నజ్ఞాన నాశకుండవు, యజ్ఞస్వరూపుండవు, దేవదేవుండవు, దేవవంద్యుండవునగు నీకు మ్రొక్కెద ననుచు బహువిధంబుల స్తుతియించిన నజ్జగదీశ్వరుండు సంతసించి శుభవ్రతుంగాంచి నీతపంబుననగు విశేషభక్తివలన సంతసించితి. శీఘ్రంబున నొసంగెద నీ కభీష్టంబగు వరంబువేడుమనిన నానృపాలుండు హర్షపరీతలోచనుండై యంజలిబద్ధంబు మస్తకంబు నఘటియించి నృసింహదేవునుద్దేసించి దేవా! జగన్మంగళంబగు భవదీయవిగ్రహంబు సేవించుటంజేసి లోకత్రయంబున ధన్యుండనయితి. నాచే బ్రార్థనీయంబిక నేమిగలదు బ్రహ్మాదిదేవతలును యోగులును సందర్శింపంగాంక్షింపంబడు నీదివ్యస్వరూపంబు ప్రత్యక్షంబునసేవింపుచున్న నాచే నన్యంబు వాంఛింపంబడునది లేదు. భవద్దర్శనంబుమాత్రంబునంజేసిమాతండ్రియగు సత్యవ్రతుండు ధన్యుండయ్యె, మత్పూర్వులగు చంద్రవంశీయరాజులందరును కృతార్థులయిరి. యామీదర్శనంబు మద్వాంఛితంబుదీర్చుటకునై యనంతకామధేను కల్పనంబొనర్చుచున్నయది తమచిత్తంబున నాయందనుగ్రహంబు జనియించిన తత్క్షణంబనా

దగువాంఛితంబు సర్వంబును సఫలంబయ్యె, నింక నేమికోరవలసినదమ్ము నామనంబున నిద్దివ్యరూపంబు సర్వకాలంబును సేవింపం గోరియున్న వాడ, మహాత్మా! శిష్యరక్షణార్థంబుగా నాహ్వానబల తుల్యంబగు నీ శోభనాచలంబున నర్చారూపుండవయి వసింపవే! యింతకన్న నన్యంబగుఫలంబే నెఱుంగ లోకసంరక్షణార్థంబుగా నాశయింగల దయచే నిప్పర్వతంబున లక్ష్మీసమేతంబుగా నివసించియున్న మిమ్ము ననుదినంబు ను సేవింపుచుండెద. సంసారంబను గ్రీష్మంబువలన పరితప్తులగు ప్రాణులజలకంబులు వగిది శీకరంబులగు నీకటాక్ష వీక్షణంబుల ననుదినంబు నువిశ్రమింపంజేయుము. తపంబొనరింపంజాలం జ్ఞానహీనులకు సత్కృద్దర్శనంబున మోక్షంబొసంగుము. జగన్నాథంబను దివ్యక్షేత్రంబున భవద్దర్శనంబుననగు ఫలంబంతయు నిప్పర్వతంబున మిమ్ము సేవించు మానవులకు లభ్యంబగుంగాక, యిదినావాంఛితంబు సర్వంబును విన్నవించితి. దేవా! యీశోభనాచలంబున నిత్యంబును భవదీయ దర్శనం బొసంగవే యని శుభవ్రతుండు వేడిన హరి సుప్రసన్నుండై సుధామధురవచనంబుల నీవు భక్తిచే రెండవ ప్రహ్లాదుండవు సంతుష్టుండనైతి నీశోభనభూధరంబున నివసించి, సర్వజలంబులకును కామితంబులొసంగెద నిచ్చట నన్ను సేవించి ప్రణమిల్లెడువారు మదీయభక్తులయందు ముఖ్యులయ్యు దేహాంతరంబు నన్నాశ్రయించెదరు. యీలోకంబున కీర్తిసంపన్నులును దీర్ఘాయుష్మంతులును ధనసంపన్నులున్ను విద్యావంతులునునై భాగవతోత్తములునై బ్రహ్మాదులకును పూజ్యులయి సర్వవిద్యావిశారదులగుచు మదేకశరణ్యులయ్యుపాసింపుచు నాయంతికంబున నిలచెదరు. యేపురుషులు వారాహతీర్థంబున స్నానంబొనరించి శృతిస్మృత్యుపదిష్టమార్గంబున నియమవంతులయి నన్ను సేవించెదరమ్మానవుల వాంఛితంబు లొక్కమాసంబున సమకూడంగలవు. యే పురుషుండు దూరదేశస్థుడయ్యును నాయందుభక్తిజేయు నప్పుణ్యునకేను తత్కాలంబుననే యీప్సితఫలంబొసంగెద, నివ్వారాహతీర్థంబునకు తూర్పున శోభనాచలంబునకు దక్షిణంబును నగు దేశంబున నివసించు జంతువులు తద్దేహాంతంబున మోక్షంబుబొందెదరు. మఱియును

నాయాశ్రమంబునందు జంతువులు సేయు పుణ్యపాపంబులు వారల స్వభావంబుగావున వారలుజీవన్ముక్తులు సంశయంబులేదనుచు లక్ష్మీసమేతుండయి యమ్మాధవుండు సిద్ధకిన్నరసేవితంబును నానావృక్షసమాకీర్ణంబును ననేకవిధమృగసంకులంబును మణిగణోద్దీపిత శిఖరాలంకృతంబును గంధర్వ విద్యాధరసమూహసంశోభితంబును పావనంబులగుపంకజకల్హారాదికంబులచే నలరుచు క్రీడించుచక్రవాకాది కలరవసంఘల జలపక్షిగణనిషేవిత సర్వదిక్తటంబును యోగాభ్యాసరతులును, వాయ్వాహారులును, నుగ్రతపస్సంపన్నులునగు సిద్ధర్షిసంఘంబులచే సేవ్యమానంబులును, గిరినిర్ఝరసలిల శీకరశీతలమృదులవాయువులచే సురతశ్రమంబు వాయఁబోదల విహరించు గంధర్వస్త్రీపురుషమిథునంబులచే నతిమనోహరంబును, కృతయుగంబున సువర్ణశిలారూపంబును, త్రేతాయుగంబున వివిధమణివిచిత్రితంబును, ద్వాపరయుగంబు నరజతాకారశోభితంబును, కలియుగంబున శిలామయంబునునయి గనుపట్టుచు కృతయుగంబున కళ్యాణభూధరంబును, త్రేతాయుగంబున శోభాచలంబు ద్వాపరయుగంబున స్వప్నగిరియు కలియుగంబున శోభనాద్రియునునై హిమవద్వంశ సంభూతంబును, దేవతాకారంబును, నుత్తమోత్తమంబును నగు శోభనాచలంబున వసియించి సమ్మోదించుచునుండుటంజేసి వైకుంఠసమానంబై యోజనదేశప్రమాణంబగు నీ క్షేత్రంబున నన్యోన్యస్పర్శదోషంబు గలుగనేరదు, లక్ష్మీసమేతుండగు నరసింహదేవుండు భక్తానుగ్రహంబుసేయుచు సర్వజనులకును భవంబువలన భయంబువాపి సంసారసాగరోత్తరణం బొనరింపుచుండెనని॥

క. శ్రీవానాద్రిరమాధవ భావనపరయతివరేణ్య పట్ట్రిభిరా।
మావరభపాదసంశ్రయ భూవర్గవరరంగధామ బుధజనగేయా॥

మాలినీ॥ విబుధజనవిధేయా విశ్రుతశ్రీనికాయా।
సుబహుళజనపోషా శోభితాశేషభూషా।
స్వబలవినిహతారీ సంశ్రితామోదకారీ।
సిబిముఖమనుజేంద్ర శ్రీకరంగేంద్రచంద్రా॥

ఇది సకలవిబుధ స్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలమర్రి లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్యకృత శ్రీబ్రహ్మాండ పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమాహాత్మ్యనిర్వచనవచప్రబంధంబునందు తృతీయాధ్యాయపరివచనము.

శ్రీమతే రామానుజాయ నమః.

చతుర్థాధ్యాయ ప్రారంభము.

—:O:—

శ్రీశోభనగిరినిలయ । శ్రీశపదాంభోజచిత్తసితపక్షసుధో ।
మేశశశిహీరహిమతా । రాశుంభత్కీర్తిచంద్రరంగనరేంద్రా॥

వ॥ దేవా యవధరింపు శౌనకాదిమును లట్లు వినినారదుం గనుంగొని మునీంద్రా! సకలపురాణవచనరచనానిపుణుండవగు నీవలన శోభనాచలమహాత్మ్యంబు సవిశేషంబుగాఁ జెప్పంబడియె, భవదీయవదనసుధాకరవినిర్గళితంబులగు యిప్పుణ్యకథామృతంబులు శ్రవణపుటంబులం గ్రోలి పుణ్యులమైతిమి, మఱియు తత్సమీపంబున వరాహతీర్థరాజంబు మీచే వినంబడియె! నప్పుణ్యసరోవరమాహాత్మ్యంబు వినంగోరెదము. జెప్పవే యని యడిగిన నారదమునీంద్రుండు మీకు తన్మహాత్మ్యంబు వినుమనంబు గలదేని వినుపించెద సావధానులరయి వినుండా ప్రభావంబు వాఙ్మనోగోచరంబు గానిది యైనను, మన్మానసగోచరంబైనంత దెలిపెద నవధరింపుడు, బ్రహ్మయు నమ్మహాత్మ్యంబు సర్వంబు నెఱింగింపం జాలఁడని పలికి యిట్లని జెప్పదొడంగె! నదియట్లనిన మునివర్యులారా! యిప్పుణ్యతీ

ర్థంబు సర్వతీర్థంబులకునుత్తమోత్తమంబు। ఈతీర్థంబుఁ బ్రశంసించువారును వినువారును మోక్షంబునొందెదరు! యిది కృతయుగంబున వరాహతీర్థంబనియును త్రేతాయుగంబున ననంతసరంబనియును, ద్వాపరంబున లక్ష్మీపుష్కరిణియనియును, కలియుగంబున దేవఖాతంబనియును,నొప్పు శోభనాచలపశ్చిమదిగ్భాగంబున మహోదధిసదృశంబయి యొప్పును, నెట్లుజూచినను యోజనదూరమధ్యదేశనివాసులను బవిత్రులంజేయుచుండుననిన శౌనకుండు మునీంద్రా! యాక్షేత్రంబునకు వారాహంబను నామధేయంబు కృతయుగంబున నెట్లులభ్యంబయ్యె, నావృత్తాంతంబంతయువినంగోరెదమని యడిగిన నారదుండు విప్రవర్యులారా! మీరందరును సావధానులయి వినుడు। దన్మూలంబంతయును వివరించెదనది యెట్లన్నను పూర్వకాలంబున హిరణ్యాక్షుండను రాక్షసుండీ భూమి సముద్రంబునకుం గొనిపోయినవాని వధించుటకునై శౌరి వరాహరూపంబుధరియించి బ్రహ్మపుటంబున వెడలి సముద్రంబున మగ్నంబగు నాభూమినన్వేషింపుచు పాతాళలోకంబునకుంబోయి కుద్దాలసదృశంబగు ముట్టెచే నిర్ఘాతసమఘుర్ఘురితభీషణఘోషణంబుల సకలలోకంబుల నాకులంబు సేయుచు విజృంభించె। నాసమయంబున నవ్వరాహదేవుని పాదసంఘర్షణంబునం జేసి యొక మహాగర్తంబుద్భూతంబయ్యె, నాగర్తంబునలన నాస్థలాభిరక్షిణియగు నొక దేవవనిత యుదయించి మహాకాయుండును క్రోడాకృతియునగు నా జగదీశ్వరుని సేవించి వినయయుక్తంబులగు వాక్యంబుల నీస్తుతి యొనరించెనది యెట్లనిన మహాత్మా! నిన్నునే నెఱింగితి నీవు జగదీశ్వరుండవును జనార్దనదేవుండవును లోకసంరక్షణార్థంబుగానీ వరాహరూపంబు ధరియించినవాఁడవు యెవ్వని దేవాదులు సేవింపంగోరి యన్వేషించెదరు। యెవ్వఁడు సర్వభూతాంతర్బహిఃప్రదేశంబుల నిండియుండు విబుధులెవని జగత్కారణుంగా నెన్నుదురు యెవనియందు లోకంబులీనంబగు నెవ్వండాద్యంతశూన్యుండెవ్వని పురుషోత్తమునిగా నెఱుంగుదురు యెవ్వఁడంతర్యామియై యుండుటచే సర్వప్రాణులు సంచరించెదరు రజస్సత్వతమోగుణంబులఁ గైకొని యెవ్వండు జగత్సృష్టిస్థితిలయంబులం జేయుచుండు నమ్మహానుభావుండ వీవాయని స్తుతియించుచున్న

ము క్రోడాకృతిధరుండగు నద్దేవుండు వరంబు వేడుమనిన నద్దేవియును
దేవా! భవత్పాదఘట్టనంబున నిర్మితంబగు నీగర్తంబు మీయీనామం
బుచే పవిత్రంబగు తీర్థరాజంబుగావలయును. మరియు నిత్తీర్థోత్తమం
బున స్నానంబుచేసినను జలస్పర్శనంబుచేసినను యిమ్మాహాత్మ్యంబు వినిన
ను నమ్మహాత్ములకు కల్మషహరమ్మును దేహావసానంబున మోక్షప్రదం
బునునగుంగాక యని విన్నవించిన దయాసముద్రుండగు నవ్వరాహదే
వుండు సుప్రసన్నుండయి నీప్రార్థనంబున వరాహతీర్థంబన చిరకా
లంబు ప్రసిద్ధంబగుంగాక యాతీర్థంబున స్నానంబు జేసిన స్మరించిన స్పృ
శించినవారలకీలోకంబున స్థిరతరైశ్వర్యంబును దేహావసానంబున మో
క్షంబును నొసంగెద, మరియు నిత్తీర్థమార్గంబున యోజనదూరమధ్యవా
సులగు ప్రాణులకును మోక్షంబవశ్యంబుగా నొసంగెద. నావాక్యం
బు నిక్కం బింతియగాదు, యి తీర్థరాజతటంబుననైన సన్నిధినైనం
దానంబొసంగు ధన్యులకు తత్ఫలంబక్షయంబగు, నాయాజ్ఞంజేసి గం
గాదిసర్వతీర్థసాన్నిధ్యంబునగు, నేనునాత్మదోషవిశుద్ధికై యిమ్మహా
తీర్థంబు నాశ్రయించెదనని పలికి మునీంద్రులారా! వరాహదేవుండు
హిరణ్యాక్షునివధియించుటకై యంతర్ధానంబునొందెగావున యీ
తీర్థంబు వరాహతీర్థంబన ప్రసిద్ధంబయ్యె, నిచ్చట సర్వతీర్థసాన్ని
ధ్యంబుగలదు, సంశయంబులేదని నారదుండెరింగించినవిని శౌనకుండు
మునీంద్రా! త్రేతాయుగంబున ననంతతీర్థాభిధానంబయ్యెనని యంటి
వదియట్లేల నారదుండు మునీంద్రులందరు వినుండెరింగించెద. పూ
ర్వకాలంబున శ్రీభూనీళాసమేతుండగుహరి శ్రీవైకుంఠంబుననుండి యొ
క్క కాలంబున నీళాసహితుండయి కొంతసేపువిహరించి యద్దేవిగృ
హంబు వెడలి బాహుద్వయంబు శేషునిస్కంధంబున నిడుకొని లక్ష్మీ
గృహంబునకుంబోవునెడ ద్వారపాలికలగు కాంతలు దిగ్గనలేచి పుష్ప
మాలాలంకృతంబులగు మస్తకంబులువంచి ప్రణామంబులు సేయుచుం
డనప్పద్మలోచనుండగు శ్రీనాధుండు మెల్లమెల్లన లక్ష్మీదేవిం జేరంజనిన
నయ్యిందిరాదేవియు తనయంతికంబున కింకరియగు నొకసురసుందరినా

లోకింపుచు మనంబున నరహరిం ధ్యానింపుచు తన చెంతకేతెంచిన పుం
డరీకాక్షునవలోకించక యించుకసేపు కూర్చుండియున్న రమాదేవిం
జూచి యనంతుండు విస్మితాంతరంగుండయ్యె, నంతతత్క్షణాంతరంబు
ననక్కమలావధూటి వైకుంఠుంగాంచి ససంభ్రమచిత్తయై సత్వరంబు
నదిగ్గనలేచి యగ్గద్దియువదిలి సిగ్గున నెదురేతెంచి ప్రణమిల్లినం జూచి
ధ్యానకారణం బెఱుంగుటం జేసి యారమాకాంతుండు మెల్లమెల్లన నవ్వు
టయు, నయ్యనంతరంబున ననంతుండు శ్రీరమాదేవిపాదంబులకు వంద
నం బాచరించి నీమనం బన్యాయత్తంబగుటకు కారణంబెయ్యది జెప్పవే
యనివిన్నవించిన దనవల్లభుం పుస్మయమానమానసోల్లసన్ముఖారవింద
సుందరంబులగు లోచనంబుల గటాక్షింపుచుసుండ నద్దేవియంజలిపుట
ఘటితమస్తకుండయి ప్రార్థింపుచున్న పన్నగేశ్వరుంగని యిట్లనియె,
కృష్ణవేణియను మహానదికి యోజనదూరదేశంబున శోభనాచలంబన
ప్రసిద్ధంబగు నొక్క మహీధరంబు వెలయుచుండు నందు శుభవ్రతమహా
రాజతపంబునకు బ్రీతుండయిన యిద్దేవుండు ప్రహ్లాదరక్షకంబగు నర
కంఠీరవరూతంబున విహరింపుచు స్వకర్మంబులచే సంసారపతితులగువా
రిందర్శనప్రదానంబున పాలించుటకునై యనుగ్రహింపుచుండె నవ్వై
భవంబు జ్ఞానగోచరంబగుటం జేసి పరవశనై జగన్నిధి యిచ్చటకు వచ్చు
టచ్చరనెఱుంగనైతిననిన ధరభృద్వరుండగు శేషుండు నజ్జననివచ
నంబులువిని తానును నన్నరకంఠీరవు సేవింపందలంచి వారాహక్షేత్రం
బునకుంజని తపోనిష్ఠులును, మహాభాగులును, జితేంద్రియులును, సత్య
సంధులును, శ్రౌతవిద్యావిశారదులును, శ్రోత్రియులునునగు మహా
యోగులనేకులుపాసింపు, నాదివరాహ పాదరేణుపవిత్రితంబును, దేవ
బృందనివాసకాంతశ్రేయంబును, నతిముక్తక్షేత్రంబునకంటె ననూనం
బునునగు నిమ్ముక్తిక్షేత్రంబుగాంచి తనకుంగలనేత్రసహస్రద్వితయంబు
నకునగు సాఫల్యంబునకు సంతసింపుచు నవ్వారాహక్షేత్రమార్గంబున
నేటకునై విక్రుతుండును క్రూరకర్ముండునునగు నొక్క చండాలునిం
గాంచి వానిశిక్షింపందలంచిన మాత్రంబున మహత్తరంబగు ధూళిప

షణంబయ్యెదుట నుత్పన్నంబయిగ్రమ్ముకొనిన తన్నిరుద్ధదృష్టిమార్గుం డై యయ్యనంతుండించుకంతయును జెరింపంజాలక క్షుభితమనస్కుం డయ్యె, నిట్లుమహాబలసంపన్నుండును పన్నగేశ్వరుండునునగు నయ్య నంతుండును ధూళీపటలంబుచే మందుఁడయియేమియునుం జేయంజా లకయున్న లక్ష్మీసమేతుండును శంఖచక్రగదాధరుండునునగు భగవం తుండు నప్పుడు సన్నిధింజేసి వికసితముఖకమలుండయి యివ్వరాహ క్షేత్రనివాసంబునంజేసి నాతోసమానుండగు చండాలునిం జంపందలం చుటంజేసి నీకీయవస్థ లభ్యంబయ్యె, నీచుండయిన నిక్కడనివాసంబుసే యుమనుజుండు నాసమానుం డిందుసందియంబులేదు. యట్టివానింజం పందలంచిన వానికి ప్రాయశ్చిత్తంబులేదు. యిచ్చట నివసించువానిం ద్వేషించు వానికి యేప్రాయశ్చిత్తంబులేదనిన నట్టివానిం జంపందలం చువానికి ప్రాయశ్చిత్తంబెట్లు ఘటియింపంగలదివ్వరాహక్షేత్రంబునజే యుపాతకం బన్యక్షేత్రంబునంబోదుగావున నివ్వరాహతీర్థంబున స్నా నంబుసేయుమని యానతియిచ్చిన నప్పన్నగేంద్రుండు వైకుంఠుని పా దంబులకు బ్రణమిల్లి యంజలిబంధంబు ఘటియించి యజ్ఞానంబున జిం తింపంబడియె. నప్పాపంబుపశమించుటకు భవదాజ్ఞాప్రకారంబున నిప్పు ణ్యతీర్థంబున స్నానంబుజేసెద నిదిలెస్స యీత్రేతాయుగంబున మదీ యనామంబుచే నీసరోవరంబు విఖ్యాతంబగునట్లు వరమ్ముకృపసేయుమ నివేడిన నట్లేయని రమారమణీరమణుండు తిరోహితుండైనను శేషుం డు నరసింహదేవు ననుజ్ఞచే హర్షింపుచు సమాహితచిత్తుండయిస్నా నమ్మొనర్చిన తన్నామధేయమ్మున నంతసరమయ్యె, నందుస్నానమ్మొన ర్చువారలనంత సమానులయ్యెదరనినవిని॥ ... ...

క॥ శ్రీరంగస్నాతంగో । దారాంగశతాంగసత్పదాదితురంగా ।
పారాంగవాహినీనిచ । యారంగయ్యాప్పరాయహతశత్రుచయా ॥

మాలినీ॥ విజితరిపుచమూపస్వీయకీర్తిప్రతాప। ద్విజపతిదివసేశోద్దీప్తలో
కప్రకాశా।యజనముఖసుకర్మాయత్తసచ్చిత్తధర్మ । ద్విజకుల
పరిరక్షాదీనసుస్వాంతదీక్షా॥ ... ...

ఇది సకలవిబుధ స్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి
లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్యవిరచిత శ్రీబ్రహ్మాండ
పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమా
హాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు
చతుర్థాధ్యాయప్రవచనము ॥

శ్రీమతేరామానుజాయనమః.

పంచమాధ్యాయ ప్రారంభము.

శ్రీ భూనీళాలంకృత । భాభాస్వద్దివ్యపార్శ్వపద్మాముఖ ।
స్వాభావికపరభక్తి । శ్రీభరితస్వాంతరంగ శ్రీరంగనృపా॥

వ॥ మరియు నవధరింపుము శౌనకుండు నారదసంయమీంద్రుం గనుంగొని యిబ్బవ్యతీర్థంబునను ద్వాపరయుగంబున లక్ష్మీ సరస్సను నామంబు మెట్లయ్యె నవ్వృత్తాంతంబును మునివరా! సవిస్తరంబుగా జెప్పవే యనియడిగిన నన్నారదమునివర్యుం డిట్లనియె, మున్ను మనువంశంబున మాంధాతయను మహీవల్లభుండు జనియించి చతుస్సముద్రముద్రితంబగు మహీమండలంబు పాలింపుచు నిఖిలశత్రుజయంబొనరించి భోగంబులకు దేవేంద్రుని ననుకరించి శౌర్యంబుచే సుప్రసిద్ధంబగు ఖ్యాతి నివహించి కాలవశంబున నష్టరాజ్యుండయి పరాశర మహాముని వలన లక్ష్మీమంత్రంబుపదేశంబునొంది యమ్ముని వచనంబుచే ధైర్యంబు

నొంది వారాహసరోవర తీరంబునకుం జేరి పూజ్యంబగు తనరాజ్యంబు మరలఁగొనుటకునై యమ్మంత్రంబు మాటిమాటికిం జపియించుచు శ్రీమహాలక్ష్మినుద్దేశించి రాజ్యలక్ష్మీకాముండయి సాంద్రంబగు తపంబొనరించె నిట్లు తపోభరంబులచే దేవతలందరికిని విస్మయంబొనరింప నట్టి యమ్మాంధాత తపంబునకు సకలలోకవందితయగు లక్ష్మీదేవి సంతసించి సత్వరంబుగా నయ్యనంతసరోవరంబున నొక్కపద్మంబున నావిర్భవించి పద్మాసనంబున గూర్చుండి మాంధాతృమహీవల్లభునకు పురోభాగంబునం గనంబడిన నమ్మహాలక్ష్మిని సేవించి పరమభక్తిసంపన్నుండై బ్రిమిల్లి తల్లీ! నిఖిలవేదస్తూయమాన ప్రభావసంపన్నయగు నిన్నుం శరణంబునొందినవాఁడ. కరుణాపరిపూర్ణంబులగు భవదీయకటాక్షవీక్షణంబుల నన్ను వీక్షించుచు రక్షించుము. మున్ను భవత్కటాక్ష ప్రసారంబులను సుధాపూరంబులచే పరిపూతులగు నింద్రాది దేవతలు విశేషైశ్వర్యసంపన్నులయి వెలయుచున్న వారలట్టి నిన్ను శరణంబుగా భజించెద. నీకటాక్షంబు ప్రసరించిననణువయ్యును మత్వసంపన్నంబగు నీకృపాపాత్రంబుగానియది గొప్పదయ్యును నణువగునను చుస్తుతియించుచున్న నమ్మహాదేవి కరుణించి వరంబు వేడుమనిన నమ్మాంధాతృమహీమండలనాయకుండు ప్రాంజలియై దేవీ! నీదర్శనంబున నామనోరథంబు పరిపూర్ణకామంబయ్యె, నింకనేమి వాంఛితంబుగలదని విన్నవించుటయు నద్దేవి యమ్మహారాజు వాంఛితంబెఱింగి యియ్యనంతసరోవరంబున స్నానంబొనర్పుము. నీయభీష్టంబగునని యానతిచ్చి యా శ్రీదేవి యంతర్ధానంబునొందిన మహీకాంతుండును నయ్యిందిరాకాంతాలలామ వచనంబులువిని యాసరోవరంబున స్నానంబుజేసిన యంతమాత్రన తత్ప్రభావంబువలన నమ్మహాత్ముండు చతురంగ సేనాసమేతుండయి సరోగర్భంబున వెడలి మరియును బహువిధధనంబులును లభింపంగొనియును, నచ్చతురంగ బలంబులతో వచ్చి శత్రువులంజయించి స్వకీయరాజ్యంబునొందె దానంజేసి యయ్యనంత సరోవరంబునకు లక్ష్మీతీర్థంబను నామంబుగలిగి ద్వాపారయుగంబున సుప్రసిద్ధంబయ్యెం గావున నిర్మలోదకంబు నీలక్ష్మీతీర్థంబున స్నానంబుసేయువారలుదా

రిద్ర్యంబుబోయి రాజ్యాధిపత్యంబు నొందెదరు. లక్ష్మీప్రసాదంబుసిద్ధిం చును, మరియునుత్పన్నంబయిన రాజ్యంబుమరలంబ్రాప్తంబగునని నారదమునీంద్రుండు జెప్పినవిని శౌనకయోగీంద్రుండు కలియుగంబున నీహ్రదంబు దేవఘాతంబను నామంబున ప్రసిద్ధింయెల్లుగనియె, నక్కథ వినంగోరెద నెరుంగింపమనుచు విన్నవించిన నారదుండిట్లనిజెప్పందొడంగె నదియెట్లనిన నీసరోవరంబునందు గంగాదిసర్వతీర్థసన్నిధింజేసి స్నానంబుజేయువారు శ్రీమన్నారాయణ నివాసస్థానంబగు పరమపదంబునకుజేర నుద్యోగింపనట్టివారిని నచ్చటకింబోవువారినిం జూచి దేవేంద్రుండు దేవసమేతుండయి తనపురోభాగంబుననున్న బృహస్పతింజూచి। యీముక్తికిం బోవువారలెవ్వరు, వీరికి ముక్తికారణం బెయ్యది సవిస్తరంబుగాజెప్పుమన, నద్దేవగురుండిట్లనియె, నదియెట్లనిన భూలోకంబున కృష్ణానదీతటంబునకు యోజనదూరంబున వారాహంబను పుణ్యతీర్థంబుగలదు. తత్క్షేత్రంబాది వరాహరూపధారియగు హరిపాదఘాతంబుననుత్పన్నంబయ్యె, నదిసన్మార్గవర్తులగు వారిపురాకృతపాపంబుల నిరసించెడు పుణ్యతమంబగు తీర్థరాజంబునతిశయిల్లు నీసరోవరంబు కృతయుగంబున వరాహతీర్థంబనియును త్రేతాయుగంబున నంతసరస్సనియును ద్వాపరంబున లక్ష్మీక్షేత్రంబనియును సుప్రసిద్ధింబొందియున్నయది యింకనిక్కలియుగంబున రూఢంబయిననొక్కనామధేయంబుగలదుయీక్షేత్రంబున స్నానంబుచేసినను జలస్పర్శనంబుజేసినను, జూచినను, ముక్తులగుదురని చక్రపాణిదేవదేవునిచే ఘోషింపంబడియెంగావున, నీసరోవరంబు స్నానాదివిధులను యథావిధింజేయు మహానుభావులు కర్మంబులంబాసి శ్రీవిష్ణుపదంబగు పరమపదంబారోహింపుచున్నవారని గురుండుజెప్పిన నింద్రుండువిని యీక్షేత్రప్రభావంబున నెవ్వడయిన స్వర్గంబుకోరి హరింపంగలడని భయంబునొంది ముక్తిహేతువను బ్రహ్మాదిపదప్రదాయకంబుననగు తత్తీర్థంబు ఖిలంబుసేయుటకు దేవతులుం దానును భూప్రదేశంబునకేతెంచి వజ్రాయుధముచే పర్వతంబుల చూర్ణంబుగానొనర్చి యాపాషాణంబులును, మృత్తికయునుంగొని దేవతలచే ఖిలంబునొందింప సునందా

దులగు విష్ణుకింకరులువచ్చి వారలంబట్టుకొని స్వర్గంబునకుబోనీకనిరోధించిరి. యిట్లున్నృశింహదేవపార్శ్వచరులచే నిరుద్ధులై యింద్రాదులు స్వర్గంబునకుం బోజాలక బద్ధులై యుండి రయ్యుడహారికింకరులింద్రాదులచే తిరుగంతప్పించుటంజేసి కలియుగంబున దేవఘూతంబన ప్రసిద్ధంబయ్యె నిప్పుణ్యతీర్థంబున స్నానాదివిధులొనర్చు జనులు నిర్ధూతకల్మషులయి శార్ఙపాణియగు దేవదేవుని పరబ్రహ్మపదంబునొందగలరు. మరియు నాక్షేత్రంబు శోభనాచలంబునకు నలుదిక్కులను నర్థయోజనప్రమాణంబుగలిగి పావనంబయ్యెందు, నీసరోవరంబిట్టిక్రమంబున నింద్రునిచే ఖలీకృతంబై మరలంద్రవ్వింపంబడియెంగావున నేమానవుండేవరాహ సరఃప్రవరంబు తిరుగ నుద్ధరింపు సమ్మానవుండు జీవన్ముక్తుండై వెలయుచుండుననిరి॥ ... ...

క॥ శ్రీపద్మాపదలాక్షో। దీపితవక్షస్థలప్రతీతవిభూషా।
భాపరిరంభితనృహరీ। శ్రీపదమ్మృదుసరసిజాతసేవానిరతా॥

మాలినీ॥ సుకవివినుతభవ్యాస్తోకకీర్తిప్రతాపా।
దికసకలగుణ శ్రీదీప్యమానస్వరూపా।
ప్రకటితనయ లక్ష్మీపాలితాశేషభూపా।
అకలుషభవ రంగాప్పరాయావనీపా॥

ఇది సకలవిబుధస్తవనీయ కాస్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి
లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్య విరచిత శ్రీబ్రహ్మాండ
పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమా
హాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు
పంచమాధ్యాయ ప్రవచనము॥

శ్రీమతేరామానుజాయనమః.

షష్ఠాధ్యాయము - ప్రారంభము

శ్రీలలనామణిమౌక్తిక । జాలాంచితభూషణప్రభజద్యుతిదివ్యా ।
స్థాలవనమాలివార్షిక । కాలాంబుదసక్తచాతకాంగనృపా॥

వ॥ దేవా మరియు నవధరింపుము నారదమునీంద్రువలన విని శౌనకసంయమిప్రవరుండు మునీంద్రా! చిత్రంబగు వారాహక్షేత్రమాహాత్మ్యంబు నీచేవివరింపంబడియె, నాక్షేత్రసందర్శనంబున నేత్రంబులును, భవన్ముఖోదీరితంబగు నక్కథవినుటచే వీనులును సఫలంబులగుంగావున నీక్షేత్రమాహాత్మ్యంబు సవిస్తరంబుగా వినంగోరి యున్నవారము. సదయుండవై సర్వంబును నెరింగింపుము. యింతకన్నమున్న నీచేయీ క్షేత్రంబు జగన్నాథ సమక్షేత్రంబని ప్రశంసింపంబడియె, గావున నదిస విస్తరంబుగావినంగోరెదము. వినువింపవేయనియడిగిన నారదసంయమీంద్రుండిట్టులనియె, నివ్వరాహతీర్థంబు స్తుతియింప నెంతవిద్వాంసుండయ్యును శేషుండును దేవగురుండును వివరింపం జాలరయినను శ్రీశోభనాచలనాథానుగ్రహంబునం జేసి మదీయబుద్ధ్యనుసారంబుగా జెప్పెదవినుండు మున్నొకకాలంబున భృగుమహాముని శ్రీకృష్ణదివ్యమంగళవిగ్రహంబు సేవింపంగోరి శ్రీజగన్నాథంబను క్షేత్రంబునకుం బోయి యందు శ్రీజగన్నాథదేవుని సేవించి పరమభక్తిసంపన్నుండై యుబ్బిణమిల్లి వేదసారార్థగర్భితంబులగు వచనంబులస్తుతియించుచు షడ్గుణైశ్వర్య సంపన్నుండగు యేమహామహుని వేదాంతవచనంబులెప్పుడునన్వేషింపుచుండు విద్వాంసులెవ్వని బ్రహ్మంబుగా నెరుంగుదురట్టియీదేవుండు దైవయోగంబున నాచే సేవింపంబడియెననిస్తుతియించి యీభృగుమహాముని కౌతుకంబున నోమహాత్మా! పురుషోత్తమా!

భవత్సాన్నిధ్యంబున మోక్షప్రదంబులగు నుత్తమక్షేత్రంబు లెయ్యవి యెఱింగింపవేయని విన్నవించిన స్మయమానముఖకమలుండై కదళీఫలరుచిరంబులగు వచనంబుల శ్రీజగన్నాథదేవుండు భృగుమునింగనుంగొని కృష్ణవేణియను నదీవతంసంబున కనతిదూరదేశంబుననగు శుభాచలంబు చెంత వారాహంబను నొకపుణ్యక్షేత్రంబు గలదదియున్ను ప్రహ్లాదరక్షణార్థంబుగా నరసింహ దివ్యమంగళ విగ్రహాలంకృతుడనగు నేను శుభవ్రతమహారాజ తపోవిశేషంబుచే ప్రీతుండనై యాశుభాచలంబుననివసించి యమ్మహీనాథప్రార్థనంబువలన నచ్చటనివసించు వారికిని నాక్షేత్రంబున గాత్రంబువిసర్జించువారికిని మోక్షంబొసంగెదనని ప్రతిజ్ఞంజేసితిగావున నీయుత్తమక్షేత్రంబున నివాసంబుజేయువారలు బ్రహ్మహత్యాది మహాపాతకంబులు వలన విముక్తులయి జీవన్ముక్తులగుదురు. సంశయంబునలువదు. మరియు నేక్షేత్రంబునయినను జ్ఞానకృతంబులగుపాపంబులు నిరసింపబడ వీవారాహక్షేత్రంబున జ్ఞానకృతంబులగు సకలవిధదురితంబులునుంబోవు నింతియకాదీవరాహక్షేత్రంబుననివసించిన క్షేత్రవాసులకు సువర్ణంబును నన్నంబును నొసంగువారలు యాక్షేత్రనివాసఫలంబునొందెదరు. మరియు నన్నదానంబున సాయుజ్యంబును సువర్ణదానంబున సారూప్యంబునుంగాంచెదురో మహాత్మా! యిదిసత్యంబు వినుము మహాపాతకంబులు చేసినవాడైనను శోభనాచలదర్శనంబుసేయుపురుషుండు సర్వపాపవినిర్ముక్తుండై యీదేహాంతంబున మదీయ పరమపదంబునొందు నింకొకవిశేషంబు గలదది యేదనిన నీశోభనగిరివరంబునకు చుట్టును యోజనదూరంబునకు లోనగుదేశంబు సర్వజంతుముక్తిప్రాపకంబుగావున యిచ్చటికి యమకింకరులు ప్రవేశింపంజాలరు. మరియు నొక్కమహావిశేషంబు జెప్పెదనాకర్ణింపుము. యీవరాహక్షేత్రమధ్యదేశంబున నొకక్రోశమాత్రదేశంబు శ్రీనివాసక్షేత్రంబనుపేర విశ్రుతంబై యున్నయదందుగల జంగమస్థావరంబులన్నియును మదీయరూపంబులగుటంజేసి చతుర్భుజులుగా నెఱుంగుము యచ్చటనుండు నరమృగపక్ష్యాది జంతువ్రాతంబులు శంఖచక్రంబు ధరియించివిహరించుచునుండుంగావున యిదిప్రత్యక్షపరమపదంబు యాప

క్షేత్రంబున పుణ్యంబుసేయు మహానుభావుండు నాసమానుండట్టి మహాత్మునకు కైవల్యంబొసంగుట కేనునుంజాలను శోభనాచల క్షేత్రంబునకు సమానంబగు స్థానంబీబ్రహ్మాండంబున లేదింతియేకాదు వరాహ క్షేత్రంబున నరసింహరూపంబున క్రీడించుచున్న నాకుభక్తనివేదితంబులగు నన్నాదిపదార్థంబులు పావనంబులగు మరియును నాప్రసాదంబు నృక్షేత్రంబునందేని నీచజనాది సంస్పృష్టంబయిన శిష్టోపభోగ్యంబును యోగ్యంబును పావనంబును పరిగ్రాహ్యంబునునగు నింతియకాదు మత్పురోభాగనివేసితంబై మన్నివేదితంబగు పదార్థంబు నీచగృహంబుననునిచిననది సభ్యోపభోగ్యంబు పావనంబునని యెరుంగుము యింకనొకవిశేషంబు వినుమదియెద్దియనిన చండాలగృహనిక్షిప్తంబైన నట్టినాప్రసాదంబు బరిత్యజించునట్టివాడు చండాలబీజ సంభూతుండగు సంశయంబులేదనుచు శ్రీజగన్నాథదేవుం డానతియిచ్చిన నాశుభవాక్యంబులు భృగుమహామునివిని ఆశ్చర్యాక్రాంతమనస్కుండగుచు నద్దేవదేవుతో నిట్లువిన్నవించె నదియెట్లనిన నవ్వారాహ క్షేత్రంబు సర్వక్షేత్రంబులకన్న నుత్తమక్షేత్రంబని భవదీయ స్తుతివచనంబుల నెరింగితి నచ్చటికింబోయి యాశోభనాచలంబున నీవగు నరహరిరూపదివ్యమంగళవిగ్రహంబు సేవింపంగోరియున్నవాడ ననుజ్ఞయొసంగ వేయని విన్నవించిన యనుజ్ఞయొసంగ వడసి భృగుమునిప్రవరుండు ప్రసన్నంబును పావనంబును రమ్యంబును సిద్ధనికరసమాకీర్ణంబును పుణ్యపురుషసేవ్యమానంబును విష్వక్సేనాది నృసింహదేవ పార్శ్వచరపరిత్యమానంబునునగు వరాహక్షేత్రంబునకువచ్చి కౌతుకంబున నంతయునవలోకించుచు నాక్షేత్రంబునకు నన్యదేశంబునకును సీమాసంధిప్రదేశంబుననున్న హరిభటులనుం దత్సమీపంబున స్వానీతపాశబద్ధులగుచు దుఃఖించుచునున్న యమకింకరులనుంజూచి యమ్ముని విస్మయమ్మున ప్రాంజలియైహరికింకరుల గనుంగొని కూరులగు యియ్యమకింకరులు స్వపాశనిబద్ధులై యచలింపకుండగ నిచ్చట నుండుటకు గతమెయ్యదియని మునియడిగిన హరికింకరులును తదవృత్తాంతంబంతయు సవిస్తరంబుగా జెప్పందొడంగిరదియెట్లనిన॥

క. శ్రీభూవధూలలామో । రోభవవైభవవిశేషరుచిరతరశ్రీ ।
శోభనగిరివర సంశ్రయ । శ్రీభామానాధచరణసేవానిపుణా॥

మాలినీ॥ సమధికతరదీప్యచ్చంద్రసచ్ఛాయకీర్తీ।
విమలితనిజపృథ్వీవిశ్రుతన్యాయవర్తీ।
సుమహితగుణపాళీ శోభితస్వీయమూర్తీ।
యమితశమతరంగవ్యాప్తవాట్చక్రవర్తీ॥

ఇది సకలవిబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చీకమర్రి లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్య విరచిత శ్రీబ్రహ్మాండ పురాణస్థిత నరసింహోత్తంచరిత్ర శ్రీశోభనాచలమాహాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు షష్ఠాధ్యాయము ప్రవచనము॥

శ్రీమతే రామానుజాయనమః.

సప్తమాధ్యాయము - ప్రారంభము.

శ్రీకమలభవముఖామర। లోకస్తుతిపాత్రపద్మలోచనకరుణా।
లోకనలబ్ధయశశ్శ్రీ । ధీకాంత్యౌదార్యసత్కృతీరంగసుధీ॥

వ॥ ధీరగుణాలంకారా యవధరింపుము: నారదుండు శౌనకాది సంయమివర్గంబుతో నిట్లను నట్లు భృగుమహామునియడిగిన హరికింకరు లిట్లనిరది యెట్లనిన, మునీంద్రా! మాళవదేశంబున విదిశాపురనివాసుండును తపస్వియునగు సుశర్మయను విప్రుండు విలాసినియనుతనభార్య

యుం దాను కొంతకాలంబు సుఖంబుననుండి కొండొకకాలంబున తీర్థయాత్రాపరుండై భార్యాసమేతంబుగా వెడలి పుణ్యతీర్థంబులం జనుచు మార్గమధ్యంబున స్త్రీసాంగత్యంబు పరిత్యజించి జనుచుండ నొక్కనాటిరాత్రి యవ్వనిత కామాయత్తచిత్తయై గాఢనిద్రాపరవశుండగు భర్తనాలింగనంజేసుకుని సంభ్రమంబుచే బలాత్కారంబున రమియించిన నాబ్రాహ్మణుండు మేల్కాంచి తీర్థయాత్రాపరాయణుండుగావున వ్రతభంగకారిణియును దురాచారిణియనగు నక్కాంతనచ్చట వర్జించిజనియె, నిట్లుపరిత్యజింపంబడినదియును, గర్భవతియునునగు నాభామిని స్వేచ్ఛాసంచారిణియై బహుపురుష సాంగత్యంబు నవ్యభిచారిణియై వసుధానగరంబుచేరి యచ్చట బహువిటపర్యటనదోషంబున పూర్వగర్భంబు భ్రష్టంబయ్యెనను మరియు కొంతకాలంబునకు సువ్రతుండను నొకపుత్రుండును సుకన్యయను నొకకూతురుం గలిగిన నయ్యుదుపురం బరిత్యజించి మనోభవాక్రాంత మానసయై యానగరంబునంగల కులటలతోకూడ నేకీభవించి విటులంగూడి నిత్యంబును సురతైకాయత్తచిత్తయై భ్రాంతయగుచు నాశిశుద్వయపరిరక్షణంబు విసర్జించిన నాడింభకయుగళంబాపురంబున తమయంతన తాము జీవింపుచు వృద్ధినొంది యావ్వనంబున కామార్తులగుచు నందుపురుషుండు భోగినులకు నొసంగుటకు ధనంబులేమి నబ్భగినితో రమియింపుచునుండె మరియును కొంతకాలంబుకు తల్లినింగాంచి యత్యంతబాల్యవిస్మృతుండు గావున దానితల్లియని యరుంగక నహోరాత్రంబులు సురతార్థియై హితంబు సేయుచుండం జూచి యప్పుడ దనస్తనంబులు జేపిపాలచేపరిప్లుతంబులగుటంజేసి తనపుత్రుండని యెరింగియు నెరుంగనదియునుం బోలె సురాపానాది దురితకర్మంబులచే గుసన్నత్తయగుచు నక్కామాతురుండగు పుత్రునితో శునియునింబోలె రమియింపుచునుండె, నిట్లా సువ్రతుండు పాపచిత్తుండై, తల్లినిం జెలియలినింగూడి, యథేచ్ఛగా విహరింపుచు మహాపాతకుండై యన్నంబులేక దరిద్రుండై యాయిరువురింగూడి క్షుధార్తులై దిక్కులందిరుగుచు చండాలవాటికలందు నిరసింపంబడిన శునకోచ్ఛిష్టమాంసంబులవలన నుదరపూరణంబుసేయుచు

స్నిమహాపాతకుండై యీశోభనాచలక్షేత్రంబున కనతిదూరంబున నొ
క్క గ్రామంబున నియ్యిరువురితోఁగూడి క్షుధాతురుండయియుండె నయ్యె
డనమ్మువ్వురును జేయు పాతకంబులన్నియు నేకంబై మూర్తీభవించి వ్యాఘ్ర
రూపంబయి యంతరిక్షంబువలన నాపాపిష్ఠులమధ్యంబునం బడిన నవ్వేగం
బున విసంజ్ఞులై పడియుండిన నచ్చట వన్యమృగంబులకై దిరుగుచు నొ
కశార్దూలంబు వారలం జూచి వేగంబున వచ్చి కంఠగతప్రాణులగు నప్పా
పాత్ములకంఠంబులు బట్టి సౌత్కంఠంబై గొని తెచ్చి యివ్వారాహక్షేత్రం
బునం బడవైచిన నమ్మువ్వురును గతప్రాణులైరి, యద్దురాత్ములమాం
సంబు వ్యాఘ్రంబాఘ్రాణించుటకునైన నొల్లక పరిత్యజించి జనియె, నంత
టయమభటులు పాశంబులు చేకొని భయంకరాకారులై గదాపాణు
లునై కొట్టుడు కొట్టుడు, కట్టుడు కట్టుడు, నరుకు నరుకుండు ననుమొద
లయిన పరుషవాక్యంబుల బలుకుచుండ నప్పాపకర్ములవాక్యంబు లాక
ర్ణించి యమభటుల నాలోకించి భయభ్రాంతులయి యుండ, నయ్యె
డ నీక్షేత్రపాలకుండగు విష్వక్సేనునిచే నిర్భర్త్సితులయి యాయమ
కింకరులు స్వకరానీతపాశంబులచే బహిఃప్రదేశనిబద్ధులయి వరించుట
కుననశక్తులయి చిరకాలంబుననుండి విమోచనంబుగానక యున్నవా
రలనుచు హరికింకరులును భృగుమునీంద్రుండును ముచ్చటింపుచుండ
యముడువిని గదాపాణియై వినయంబున వచ్చి భృగుమహాముని పాదం
బుల కభివాదనంబు చేసి హరికింకరులకు మ్రొక్కి మరియు నమ్మునివరున
కభిముఖుండై యోమహాత్మా! యీక్షేత్రంబునకు మీరాకకు నెదురు
చూచుచున్నవాడను, దైవయోగంబునం జేసి మిమ్ముసేవించితి. యీ
క్షేత్రమహాత్మ్యంబెఱుంగక నాభటులజ్ఞానకలుషితహృదయులై యిచ్చ
ట దేహంబులబరిత్యజించు మర్త్యులకు మోక్షంబగుట యెఱుంగరయిరి ప
రమపదప్రాపకంబగు నీక్షేత్రంబున సాహసంబున పదంబిడుటవలన నీ
క్షేత్రపాలురచే దృఢతరపాశనిబద్ధులై వీరలేనాఁటినుండియున్నవారలజ్ఞుల
గువీరల బంధవిముక్తులం జేయ మీరలుతగుదురుగాని యన్యులెవ్వరును
యీకార్యంబు నెరవేర్పంజాలరు, మహాత్మా! దయచే రక్షింపవేయను
చు యమ్మహాముని పాదంబులపై దానుబడియును తనభటులచే మ్రొ

క్కించియును నద్దేవదేవుతో మాపయిదయబుట్టంజెప్పవేయనియును విన్నవించిన నంగీకరించి వారలసుండుమనితాను శోభనాచలంబునకుం జనుచు నచటగల సెలయేరులంగల జలంబుల నధ్వశ్రమంబపనయింపు శోభనాచలాకారసంశోభమానంబగు శ్రీవైకుంఠంబధిగమించియచ్చటనరహరిసాన్నిధ్యంబున కాయసిద్ధులయితపంబుచేయుచున్న కొందర సిద్ధులంగాంచుచు సురుచిరరత్నవిచిత్రతర శిఖరాలంకృతంబును సిద్ధకిన్నరవిహార్యమాణంబును గీతవాదిత్రముఖరిత దిఙ్ముఖంబును అప్సరస్త్రీసంక్రీడన సమాలంకృతంబును భానుమరీచివర్గసంసర్గ ద్విగుణితఘృణివిభాసమాన పద్మరాగమణిమయ శిలాతలపట్టికా విరాజితంబును మునిగణసమాకీర్ణంబును నానావిధపాదపసంశోభితంబును వివిధవిబుధసమాజ సమాశ్రితంబును నవవిధానేక రత్నఖచితప్రదేశాభిరామంబునునై మరియు నొక్కరమ్యస్థలంబున గంధర్వులును నొక్కయు చితప్రదేశంబున నింద్రాదిదిక్పతులును నొక్కరమణీయతలంబున బ్రహ్మాదులను వసియించిసేవుచుండ నన్నరహరిపార్శ్వచరులగు ననంత గరుడవిశ్వక్సేనప్రముఖ నిత్యసూరి వర్గంబును సనందనాదిభక్తవర్గంబును దివ్యదేహంబులుధరియించి సన్నిధానంబునదీపించు చక్రాదిదివ్యహేతివ్రాతంబులును యముండుదక్క మిగిలినదిక్పాలకులునుసేవింపుచుండ శోభితంబగు నాశోభనాచలంబారోహించి లక్ష్మీసమాశ్లిష్టదివ్యమంగళవిగ్రహుండైయుపవసించియున్న శ్రీనృసింహదేవునిదివ్యరూపంబుసేవించి ప్రణమిల్లిలేచి నిటలతటఘటితాంజలిపుటుండై దేవదేవా! నిర్మలాత్మా! మహాత్మా! నిఖిలకారణకారణా! చతుర్ముఖజనకా! సర్వజగన్మయా అనంతకళ్యాణ గుణగణమణిగణార్ణవా! నరకంఠీరవాకారా! భవబంధవిభంజనా! భవదీయపాదారవిందంబులకనేకవారంబులు నమస్కరించెద సమస్తంబగు వేదంబులును భవదీయప్రభావంబేమియుస్తుతింపంజాలక నివర్తింపుచున్నయవియని వేదంబులుజెప్పుచున్నవి, యట్టివిచిత్రతరంబగు భవదీయచరిత్రార్ణవంబభివర్ణింప నెవ్వరోపుదరనుచుస్తుతియింపుచున్న భృగుమునిగని శ్రీనరసింహదేవుండుకుశలంబడిగి సుఖంబుననుండుమనినియమించి నీవన్నిలోకంబులం

జూచితే యీలోకంబులన్నియును నిరామయంబుగానున్న వేయునియ
డుగుటయును నాప్రహ్లాదవరదుని వచనంబులు సాదరంబుననిని భృగు
మహాముని జగన్నిధీ సర్వరక్షణప్రవణుండవయి జాగరణంబుచేయుచు
వర్తింపుచుండ సర్వలోకంబులకు నశుభంబెచ్చటనుంగలుగనేరదు. మ
రియు నిన్నునారాధించు భక్తులతగు సౌఖ్యంబుజెప్పనేల పురుషోత్త
మా! భవదీయదివ్యరూపంబు శ్రీజగన్నాథంబున సేవించితదనుజ్ఞాతుం
డనైయిమ్మునిచ్చటసేవింపవచ్చినాడ నానేత్రంబులకల్మియును జన్మంబు
ను భవద్దర్శనంబున సఫలంబయ్యె ప్రహ్లాదరక్షకంబగు భవదీయదివ్య
మంగళవిగ్రహంబుసేవించికృతార్థుండనైతి దేవా! యించుకవిజ్ఞాప
నంబుగలదు రక్షింపుము. నావిజ్ఞాపనంబువినుటకు కరుణగలదేని య
నుజ్ఞయొసంగవేయని విన్నవించుటయు నన్నృసింహదేవుండునవధరిం
చి యాకార్యంబుజెప్పుము చేసెదననుచు సాదరంబునబలికిన నయ్యో
గీంద్రుండు దేవా! యీవారాహక్షేత్ర బాహ్యప్రదేశంబున పాశని
యంత్రితులయి కృతాంతదూతలున్నవారు వారు దేవరసన్నిధానంబున
నపరాధంబుజేసియున్నవారైనను సకలలోకాత్మకుండవగు నీకీక్షుద్రుల
వలననేమికొరంత గావున వారల విడుపింపవేయని విన్నవించిన శౌరి
స్మయమానముఖుండగుచు నోమునివరా! యిప్పాపచారుల కార్యం
బుకు నీవెట్లునిబద్ధుండవైతివి వీరలీమహాక్షేత్రంబు ముక్తిప్రదంబనియె
రింగియును యిచ్చటదేహాంతంబునొందిన మర్త్యులంగొనిపోపుటకై వ
చ్చిరి. పాపులైననుపుణ్యులై నీక్షేత్రంబున దేహంబు పరిత్యజించిన
ప్రాణులు మదీయపదంబులనొందిమాతోసమానులగుదురు. మరియు
ను యీక్షేత్రంబున మనుష్యులు మృగాదులును శంఖచక్రధారులై
నిత్యంబునుక్రీడింపుచుందురు వారందరునుజీవన్ముక్తులు సంశయంబులేద
ను నిదిమదీయప్రఖ్యాపనంబును త్రైలోక్యవిదితంబైనను రభసంబున
వీరలిచ్చటకువచ్చి పాశనిబద్ధులైరి. యీదురాత్ములవదలు కార్యంబు
గాదైననునీచేవిజ్ఞాపింపంబడియె ననుహరివచనంబులువిని మునివరుం
డు దేవదేవా భవదీయానుగృహీతపక్షసంస్థాపనంబుత్తమపక్షంబైనను
సాపరాధులగు యయ్యమకింకరులను విక్రుతాంగులనుజేసివిడుపింపవే

యనిసాంజలియై యనుజ్ఞవడసి కింకరులవిడిపించి హరిచేననుజ్ఞాతుం డైనాలోకంబునకుంజనియె. గావున నివ్వారాహక్షేత్రంబు సర్వక్షేత్రంబులకన్న నుత్తమోత్తమంబు శ్రీజగన్నాథక్షేత్రతుల్యంబుగా నెరుంగుమనిన॥ ... ...

క. బుధగురుకవిపూర్ణకళా। నిధిశోభితభవ్యనిత్యసిహితతమస్కా।
ప్రథితరుచిరత్రయీతను। పృథులసభావిభవరంగపృథ్వీరమణా॥

మాలినీ॥ ప్రముదితనిజబంధుప్రస్ఫురత్పద్మసూర్య।
స్వమహితహితవర్గస్థాపనైకస్వకార్య।
స్వమతపరసపర్యాసత్కృతస్వార్యవర్యా।
నుమితసతతభవ్యానూనసాజన్యచర్యా॥

ఇది సకలవిబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్య విరచిత శ్రీబ్రహ్మాండ పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమాహాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు సప్తమాధ్యాయ ప్రవచనము॥

శ్రీమతేరామానుజాయనమః.

అష్టమాధ్యాయము - ప్రారంభము.

శ్రీకౌస్తుభాదినిస్తుల। భాకమనీయోరుహారభాసురవక్ష।
శ్రీకాంతపాదసంశ్రయ। ధీకవితారంగరాట్సుధీనరనాథా॥

వ॥ దేవా యవధరింపు మట్లు శౌనకుండు విని మునివరా! పాప
హారంబులగు ననేకపుణ్యకథలు నీచే వింటిమి. మరియు కృష్ణవేణీమాహా
త్మ్యంబు విచిత్రంబయియున్న యది యందు స్నానంబు చేసినను స్పృశిం
చినను స్మరించినట్టి శరీరధారులకు పాపంబులు పుణ్యంబులగుననినీవల
నవినియుంటి మది యట్లనిన, నారదుండిట్లను శౌనకమునీంద్రా! బుద్ధి
సంపన్నా! యాతీర్థవైభవంబు వినుము. వర్షశతంబులకైనన తీర్థ
వైభవంబు సవిస్తరంబుగా వర్ణింప నేను సమర్థుండగానైనను సంక్షే
పంబుగా జెప్పెద నాకర్ణింపుము। పూర్వకాలంబున నొక్కనాడు సత్య
లోకంబున చతుర్ముఖుండు సభాసీనుండై యుండ గంగా యమునా న
ర్మదా సరయూ సరస్వతీ శోణా కృష్ణవేణిందక్క నదులనన్నిటిని పా
వనత్వాది గుణంబుల స్తుతించి బహూకరించిన। నట్లువివరించిచే శ్లాఘ
నంబు వడసి సంతుష్టహృదయులై యుండ జూచి కృష్ణవేణి సంతప్త
హృదయయై, మ్లానముఖంబుతో భూలోకంబునకు వచ్చి, తనను తాను
నిందింపుకొనుచు చింతాక్రాంతచిత్తయగుచు, యేయుపాయంబున
నన్నినదులకంటె నుత్తమత్వంబు నొందెద ననుచు బల్కి చింతింపుచు
నుండ, దైవయోగంబున నాకాశంబున నొక్కవాక్యంబు వినబడియె, నది
యెట్లనిన నీవు విచారంబు మానుము, యిచ్చటకు నుత్తరంబున వారా
హంబను నుత్తమతీర్థంబు గలదు, తత్తీర్థంబు దేవతలకైన దుర్లభం
బై యుండు, లతావితాన లలితంబును హింతాల పున్నాగ తమాల వ
కుళాది విటపికుల సమాకులంబును, దర్శన స్పర్శన సంస్మరణాదుల
లచే సర్వపాపప్రశమన కరంబును సర్వకామఫలప్రదంబును సర్వతా
పహరణంబును, సర్వాపన్నివారకంబును నగునాసరోవర తీరంబున
నచిరకాలంబు తపంబొనరించి కాంక్షితంబునొందగలవు విచారబుంవ
లువదచ్చట శోభనాచలంబున శ్రీహరిని సేవించి, శీఘ్రంబున కాంక్షితం
బునొందెదవు నీవన్నినదులకన్న నాధిక్యంబు నొందెదవు జయింపగల
వు, నావాక్యంబులు నమ్ముము పొమ్ముపొమ్మనుచు నాకాశవాణి బల్కినవి
ని, కృష్ణవేణి సంతోషతరంగితాంతరంగిణియై యప్పుడ లేచి శోభనాచ
లంబునకేగి యచ్చట జగన్నాథుండును ప్రహ్లాద వరదుండును, నరసింహు

స్వరూపుండునునై రమాదేవియుండానును క్రీడింపుచున్న భగవంతున
కునవశ్యక్తప్రదక్షిణంబు లొనరించి షోడశోపచారపూజనంబులు విధ్యు
క్తప్రకారంబుగాగావించి యాసరిచ్ఛ్రేష్ఠంబు విశిష్టవచనంబులచే సం
తుష్టాంతరంగతరంగిణియైస్తుతియింపందొడంగె నెట్లనిన। నోదేవదేవా!
జగన్నాథా! పురాణపురుషోత్తమ! ప్రణతార్తిహర; జగదవనచరణ!
శంఖచక్రాది దివ్యాయుధాలంకృత కరాంబుజాత చారుపీతాంబరాలం
కృతశరీర! అచ్యుత! కరుణాకర! సర్వేశ్వరనిత్యంబునునీకుబ్రణమిల్లెద।
నీవుదైవతంబులకుదైవంబవు! మంగళంబులకు మంగళంబువు నీవయజ్ఞం
బువు- వషట్కారంబువు, జగదేకకారణుండవు.పరాత్పరుండవు,నీవా
క్కరుండవు నిఖిలజగదుత్పాదనరక్షణంబులు సేయుచుండువునీయంద
సర్వంబునునొక్కెడవిలీనంబగుచునుండు, నీవుసర్వశబ్దవాచ్యుండవు,స
నాతనుండవు, నియంతవు, యంత్రజ్ఞుండవు,నగుచు, కౌతుకంబునప్రా
ణులకు పరస్పరకలహంబుగల్పించి క్రీడించెదవు। యోగీంద్రులునిన్ను
చిదానందంబునభావించెదరు. పరమపురుషార్థసంపన్నులగుకొందరు
మాయావిముక్తులై నిన్ను సేవించెదరు. బుద్ధివిహీనులుమాయావశుల
గుచు నిన్నుంగాననేరరు, కమలారమణా! యోగానందరూపా; నర
సింహదివ్యమంగళవిగ్రహా! అచ్యుతా; అనంతా; మధుసూధనా; ప్రస
న్నుండవగుము. నీలమేఘాంతరగతవిద్యుల్లేఖచందంబునభాసురంబయి
నివ్వరిముల్లుకుసమానంబగు సూక్ష్మాకరంబగుచుహారితభాయయైప్రాణి
హృదయాకాశంబున భాసిల్లెడు వహ్నిశిఖామధ్యంబున బ్రహ్మేంద్రాది
పరివారసమేతంబుగా ప్రకాశించెడు పరమస్వరాట్స్వరూప మహాత్మా;
యనుచుబల్మారుస్తుతియింపుచు బ్రణమిల్లి భగవత్సందర్శన ప్రేమాతిరే
కంబుచే నతిప్రయత్నంబున దన్మందిరంబువెడలి వరాహసరస్తీరంబున
మనోహరంబగు నొకకుంజంబునివాసమందిరంబొనర్చుకొని సంధ్యాత్రి
తయంబునందును మంత్రపూతంబుగాతత్తీర్థావగాహనంబుసేయుచు
బ్రణతార్తిహరుండును శోభనాచలనికుంజపుం వీథివిహరణ క్రీడాపర
సపరాయణుండునునగు శ్రీలక్ష్మీనరసింహుని హృదయపుండరీకంబున
నిడుకొనినృసింహానుష్టుభంబను మంత్రోత్తమంబునతతంబునుజపియిం

పుచు సమాహితాంతఃకరణయై కొంతకాలంబునివసించియున్నంత స్వల్పకాలంబున నద్దేవుండు దత్తపంబునకు సంతసించు కృష్ణవేణికిపరం బొసంగుటకై యయ్యంతికంబునక్రీడింపుచు ప్రత్యక్షంబైన ప్రణతార్తిహరుండగునమ్మహాత్ముని శ్రుతిగర్భంబులగు శ్రుతివచనంబులబల్మారుసంతసింపంజేయుటయు స్తోత్రావసానంబున క్కమలాకాంతుండు ప్రసన్నుండయి యాకృష్ణవేణినికటాక్షించి సాంత్వనవాక్యంబుల నీకుభద్రంబగుగాక! నీమనంబునంగలయభీష్టంబు వేడుకొనుము నృశింహానుగ్రహంబునిరర్థకంబుగానేరదని యానతిచ్చిన యాకర్ణించి కృష్ణవేణీతరంగిణి సంతుష్టాంతరంగిణియై దేవా! సత్యలోకంబున నొక్కనాడుగంగాదిసర్వనదీసమ్ముఖంబునచతుర్ముఖునిచేసంప్రాప్తంబైనయవమానంబుసహింపంజాలనని విన్నవించిన ననంతకళ్యాణగుణపరిపూర్ణుండగు నిఖిలభూతేశ్వరుండు కరుణించి యితరనదులందుస్నానంబుసేయు మహాత్ములుపాపంబువలన నిర్ముక్తులగుదురు. నీయందుస్నానంబుజేసిన మనుజులపాపంబులును పుణ్యంబులగు-నిదిసత్యంబు- సత్యంబనుచు బల్మారుబల్కుచు నింకవిచారంబువలువదు, నీజలంబులస్నానంబుజేయువారిదురితంబులెట్టివైనను తత్క్షణంబునపుణ్యంబులగుచున్నవిగావున నాయనుగ్రహంబువలనసర్వనదులయందునుత్తమోత్తమత్వంబునొందంగలవనుచు శ్రీశోభనాచలేశ్వరుండు కృష్ణవేణీతరంగిణికి వరంబొసంగినవిని మహర్షులు సంతసించిరి. యప్సరోగణంబులుసంతసంబుగనర్తనంబులొనర్చిరి, యాకసంబున పుష్పవర్షంబుగురిసె, గంధర్వులుగానంబుజేసిరి, దేవతలుదుందుభులుమొరయించిరి, సనకాదిమహామునులుస్తుతియించిరి, యిట్లుశోభనాచలదేవుండుత్తమవరంబొసంగిన యాకృష్ణవేణీతరంగిణి ప్రహర్షాంతరంగిణియయినంజూచిసంమోదింపుచు నక్షణంబయ ద్దేవుండంతర్ధానంబునొందె. నాకృష్ణవేణియును సంపూర్ణమనోరథయై వరాహసరోవరవిమలోదకంబులస్నానంబుజేసి యావైభవంబువర్ణింపుచునరహరియొసంగినవరంబుగొని గారవంబుపదలుచుసంతసింపుచునిజస్థానంబునకుంజనియె। శౌనకమహామునిసత్తమా; యీయత్యంతరహస్యంబగుసర్వోత్తమతీర్థప్రభావంబు సర్వంబునునీకుంజెప్పితి-యేతీర్థంబందైననుసే

యంబడినపాతకంగంబుగాతీర్ణంబునంశాయు, గంగాతీర్థకృతంబగు పాతకంబులీతీర్థజల సంస్పర్శనాదులవలనబోవువారాహతీర్థమ్మునందొక్కమారుస్నానమ్మొనరించినవదిసహస్రవర్షంబులు గంగాస్నానంబుశేసినఫలంబుప్రాప్తంబగు. నెవ్వడేనివరాహతీర్థస్నానంబుసేయందలంచునామానవుండు సర్వతీర్థస్నానఫలంబు నొందుసంశయంబులేదు. ... ...

క॥ శ్రీనరకంఠీరవలస । మానాంకమృగాంకకాంత మహనీయతరా।
నూనవిభవాభిరామ ర । మా నిత్యకటాక్షలబ్ధ మాన్యత్వనిధీ॥ ...

మాలిని॥ స చి వ వి బు ధ భృ త్యా స్థా న సం మో ద భా వా।
ప్ర చు ర త ర య శ స్సం ప త్ప్ర తా ప ప్ర భా వా।
శు చి త మ సు మ న స్సం శు ద్ధ పూ జాం ఘ్రి సే వా।
ప్ర చ ర ణ ను ము ఖో ద్దీ ప్య న్నృ సిం హా క్ష్య దే వా॥

ఇది సకలవిబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి
లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్య విరచిత శ్రీబ్రహ్మాండ
పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమా
హాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు
అష్టమాధ్యాయ ప్రవచనము ॥

శ్రీమతేరామానుజాయనమః.

నవమాధ్యాయము - ప్రారంభము.

శ్రీరాజ్యేందిర నృహరియు । వారాహసరస్సరోజ వాయుస్పర్శో ।
ద్వారితవిహారణజశ్రమము । లైరక్షించెదరురంగయాహ్వారాయా ॥

వ॥ దేవాయవధరింపు మట్లునారదమునీంద్రుండు జెప్పినవిని శౌనకముని చంద్రుండమ్ముని వరుంగనుంగొని మహాత్మా! భవన్ముఖంబుననిప్పుణ్యకథలు వినుటంజేసి కృతార్థులమైతిమి। జన్మసాఫల్యంబుగంటిమి. యిమ్మాహాత్మ్యంబువిచిత్రంబై యున్నయది, యిందుగలపుణ్యకథలువిచిత్రంబులై యున్నయవి, చిత్రశిఖండిజతుల్యంబగు భవదీయవచనరచనాచాతుర్యంబునుబహుతరవిచిత్రంబై యున్నది, మునివరా! యాపూర్వకాలంబున శుభవ్రతమహీమండల నాథుండట్లచ్యుతునియందు ప్రసన్నుండై తపంబొనరించి పిమ్మట యచ్చటనివసించియుండె, నమ్మహారాజవృత్తాంతంబునించుకంత జెప్పవేయనియడిగిన విని నారదుండిట్లనియె, నోమునీంద్రా! పూర్వకాలంబున శ్రీమంతుండగు నాశుభవ్రతమహారాజేంద్రుండు శోభనాచలనాథుండగు నరహరినిభజించుచుచిరకాలంబచ్చటనుండ నమ్మహారాజమంత్రులుపురంబు వెడలివచ్చి శుభవ్రతుని సందర్శించి సాంత్వనవచనంబుల రాజ్యపరిపాలనంబుకై బల్మారుప్రార్థించిన నద్దూరదేశస్థితపురీనివాసంబంగీకరింపక శోభనాచలసమీపభూప్రదేశంబున సురవరపురోపమంబగు సూరసేనపురంబునివాసంబు జేసుకుని నిత్యంబును శోభనశైలరాజంబునకుంజని శ్రీలక్ష్మీనృసింహమహోత్సవంబులుసేయుచుండె, నదియట్లనిన; తన్మహీధరాంతికమహాప్రదేశంబున తద్భక్తజననివాసమందిరంబులొనర్చి యమ్మహాత్ములగూడినిఖిలోత్సవంబులునుసేయుచు రాజపరిపాలనలబ్ధంబులగునిఖిలరత్నంబులును, ధనంబులును, భగవదర్థంబుగా సమర్పించుచు రమాకాంతుననిశంబును సంతసింపంజేయుచుండె, నిట్లుస్వభోగార్థంబుగాక రమాకాంత మహోత్సవార్థంబుగా రాజ్యపరిపాలనంబున ద్రవ్యార్జనంబులుసేయుచు మహోత్సవంబులొనరింప నద్దివ్యోత్సవంబులుసేవించుటకునై బ్రహ్మరుద్రేంద్రాదులేతెంచిసేవించిశుభవ్రతునిబహుప్రకారంబునబ్రశంసించిరి. మఱియుబ్రహ్మాదులును సర్వదిక్పాలురును ప్రతిమాసంబునందును నక్రకటఘాంతకునికిం ప్రమోదార్థంబుగా మహోత్సవంబులు సేయింపుచుండెదరు, శ్రీనరహరియును రుక్మిణీసమేతవిలాసగోపాలవేషియై జగన్మదంబొనరింపుచుండు, మరియును ప్రలంబమానరుచిరతరకర కమలప్రి

రాజమానవిలాసవేణుండును శంఖచక్రాలంకృతకరసరోరుహుండును నభయప్రదాయియును చిత్తజకోటిసుందరాకారుండును నైవిలాసగోపాలదివ్యమంగళవేషధారియైయొప్పు నరహరినేనుభజించెదను. యింతియకాదు,రుక్మిణీసత్యభామాసమేతంబుగా విలాసగోపాలసుందరాకారుండై రథంబునవెలయుచున్నదద్దేవుని సేవించుమానవులుజీవన్ముక్తులగుదురు-సంశయంబువలువదట్లు లక్ష్మీసమేతంబుగాసమస్తదివ్యపరివారపరివృతుండై శోభనాచలంబున విహరింపుచున్న నరకంఠీరవదేవమహాత్మ్యం బెవ్వరేనియుంజూచినను కుతూహలంబునవిన్నను శాశ్వతపరమపదనివాసులగుదురు. నిశ్శంశయంబు,మఱియునిక్కథవినువారును వ్రాయువారును, పఠియించువారును, యీలోకంబునపుత్రపౌత్రాది బంధువర్గసహితంబుగా విశేషసంపత్సౌఖ్యంబుల ననుభవింతురు. యీ నృసింహమాహాత్మ్యసంహితను యేమానవుం డాస్థాసంపన్నుండయ్యును తద్రహితుండయ్యును వినినేని యాపురుషుండుదీర్ఘాయువును, సత్కీర్తి నింబొందెడు. మఱియునిమ్మాహాత్మ్యంబువినువారును పఠియించువారును మహాపాతకయుక్తులైనను యీలోకంబునధన్యులై క్రమంబునవిష్ణుమందిరంబునొందెదరనుచు నారదసంయమీంద్రుండు జెప్పిన శౌనకాదిమునులుసంతసించి మావంటివారలకు యిమ్మాహాత్మ్యంబువినుట కన్ననధికంబగుజన్మఫలంబన్యంబెయ్యదిగలదు- మహాత్మా! తపస్సుసఫలంబయ్యె, నింక మాయందువాత్సల్యంబుగలుగు నేని నీముఖాబ్జంబువలన నహోబలమాహాత్మ్యంబు సర్వంబునువినంగోరెదము. బ్రహ్మర్షిసత్తమా! బ్రహ్మణ్యా! సవిస్తరంబుగా నెఱుంగజెప్పవే . ...

క॥ అనునిది బ్రహ్మాండపురా । ణనిబద్ధశ్రీశుభాద్రినాథప్రపంచా ।
ననసంహితాంధ్రవచనర । చనమగుసంపద్యశోభిసంభావుకమై ॥

శా॥ శ్రీవానాద్రియతీంద్రచంద్రపదసంసేవాసమాసక్తచి ।
త్తావాప్తాగమవేద్యహృద్యనరసింహారాధనప్రేరిత ।
శ్రీవాసీరమణీయభవ్యగుణసౌశీల్యాగ్ర్యకీర్తిప్రథా ।
పావాసా* శ్రితవాసవాదికకలాప్వారాయరంగాశ్రయా ॥

---

*శ్రితాః వాసవాదికానాం ఇంద్రాద్యష్టదిక్పాలకానాం కలాః అంశాః యేన సతథోక్తః

మాలిని॥ ప్రథితశుభచరిత్రా ప్రస్ఫురద్భవ్యగాత్రా।
మథితనమదమిత్రా మానితాశేషమిత్రా।
పృథుతరశ్శుభగోత్రా పైంద్రభూపేంద్రపుత్రా।
గ్రథితవిభవకృష్ణా గౌతమీమధ్యగోత్రా॥ ....

ఇది సకలవిబుధస్తవనీయ కాశ్యపసగోత్రపవిత్ర శ్రీమచ్చిలకమర్రి
లక్ష్మణాచార్య తనూజాత వేంకటాచార్య విరచిత శ్రీబ్రహ్మాండ
పురాణస్థిత నరసింహోత్తరచరిత్ర శ్రీశోభనాచలమా
హాత్మ్యనిర్వచన వచనప్రబంధంబునందు
నవమాధ్యాయ ప్రవచనము॥

శ్రీశోభనాచలమాహాత్మ్యము తెలుగువచనప్రబంధముసమాప్తము.